బుధవారం
30-08-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 70
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

కోడికత్తి కేసు విచారణ వాయిదా

విశాఖలో కోర్టుకు హాజరైన నిందితుడు శ్రీను

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోడికత్తి కేసుపై మంగళవారం విశాఖ ఎన్ఐఏ కోర్టులో విచారణ జరిగింది. విశాఖ మూడో అదనపు జిల్లా కోర్టు విచారణను సెప్టెంబర్ 6 తేదీ కివాయిదా వేసింది. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్షనేతగా ఉన్నప్పుడు 2018, అక్టోబరు 25న విశాఖ విమానాశ్రయంలో ఆయనపై దాడి జరిగింది.

8 లో



మళ్లీ వెయ్యి కోట్ల అప్పు

- 11 ఏళ్లలో 7.45 శాతం వడ్డీతో చెల్లింపు షరతు
- ఐదు నెలల్లో రూ.35,500 కోట్లకు చేరిక

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మంగళవారం అప్పులు చేసే కార్యక్రమాన్ని ఇంకా కొనసాగిస్తూనే ఉంది. దీనిలో భాగంగా రిజర్వు బ్యాంకు సెక్యూరిటీ బాండ్ల వేలంలో పాల్గొని మరో వెయ్యి కోట్లు అప్పు తెచ్చింది. వీటిని 11 సంవత్సరాల్లో 7.45 శాతం వడ్డీతో చెల్లించే షరతుతో తీసుకున్నారు. కేవలం ఆర్‌బీఐ దగ్గర సెక్యూరిటీ బాండ్ల వేలం ద్వారా గత 5 నెలల కాలంలో 35,500 కోట్ల రూపాయలు అప్పు తెచ్చి ఏపీ సర్కారు రికార్డు సృష్టించింది. ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితి పూర్తి కావడంతో మళ్లీ అప్పు కోసం దిల్లీలో కేంద్ర ఆర్థిక శాఖ చుట్టూ రాష్ట్ర అధికారులు తిరుగుతున్నారు. ఒకటో తేదీన ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పెన్షన్లు ఇవ్వాల్సి ఉండటంతో మళ్లీ అప్పు కోసం కేంద్రాన్ని కాకా పడుతున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి, ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి గత ప్రభుత్వం కంటే తాము అప్పులు బాగా తక్కువ తెచ్చామని ఒక ప్రక్క విస్తృత ప్రచారం చేస్తూ, మరోవైపు అవకాశం ఉన్న ప్రతిచోటా అప్పులు తీసుకువస్తుండడంపై ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చంద్రుడిపై సల్ఫర్ ఆనవాళ్లు

- నిర్ధారించిన ప్రజ్ఞాన్ రోవర్
- ఆక్సిజన్‌నూ గుర్తించిన ఎల్ఐబీఎస్ పరికరం
- హైడ్రోజన్ కోసం అన్వేషణ : ఇస్రో

2 లో

ఎన్నికల తాయిలం

- వంటగ్యాస్ సిలిండర్‌పై రూ.200 తగ్గింపు
- నేటి నుంచి అమలు
- చంద్రయాన్-3 ఘనతపై కేంద్రకేబినెట్ తీర్మానం ఆమోదం

న్యూదిల్లీ: త్వరలో ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, సార్వత్రిక ఎన్నికలు జరగనున్న దృష్ట్యా ప్రజలను తమ ముగ్గులోకి దించే ప్రయత్నాలకు బీజేపీ ప్రభుత్వం పదును పెంచింది. 2020 నుంచి వంట గ్యాస్ సిలిండర్ ధర దాదాపు రెట్టింపు అయిన క్రమంలో ప్రధాన పార్టీల ఎన్నికల మేనిఫెస్టోల్లో ఎల్పీజీ సిలిండర్ ధర తగ్గింపు కీలకాంశంగా మారింది. వంట గ్యాస్ ధర తగ్గిస్తామన్న హామీని మధ్యప్రదేశ్, కర్నాటక వంటి రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఇచ్చింది. మరోవైపు ఇండియా కూటమిగా ప్రతిపక్షాల ఐక్యతతో కాషాయ పార్టీ వెన్నులో వణుకు మొదలైంది. అధిక ద్రవ్యోల్బణంతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఎల్పీజీ ధరలతో భారం మరింత పెరిగింది. ఇదే అంశాన్ని కర్నాటకలో ఎన్నికల అస్త్రంగా కాంగ్రెస్ మల్చుకుంది. మధ్యప్రదేశ్‌లో అధికారంలోకి వస్తే రూ.500కు గ్యాస్ సిలిండర్ ఇస్తామన్న హామీనిచ్చింది. నవంబరు-డిసెంబరులో ఆ రాష్ట్రంలో ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజావ్యతిరేకత నుంచి బయటపడి ప్రజలను ఆకర్షించేందుకు

- మిగతా 2 లో

చర్చలతోనే మణిపూర్‌లో శాంతి

- సాధారణ పరిస్థితులు నెలకొల్పాలి
- ప్రజలకు తగు వసతులు, పరిహారం కల్పించాలి
- రాష్ట్రపతికి సీపీఐ నేతల వినతి

న్యూదిల్లీ: కొన్ని నెలలుగా అట్టుడికిపోతున్న మణిపూర్‌లో శాంతి, సామరస్యం నెలకొల్పేందుకు తగు చర్యలను సత్వరమే తీసుకోవాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్మును సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా కోరారు. ఈశాన్య రాష్ట్రంలోని ప్రతివర్గాన్ని కలుపుకొని రాజకీయ చర్యలు చేపడుతూ సమస్య పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని నొక్కిచెప్పారు. సాధారణ పరిస్థితులు నెలకొల్పడం ముఖ్యమన్నారు. ఇటీవల ఈశాన్య రాష్ట్రానికి వెళ్లి క్షేత్రస్థాయి పరిస్థితులను అధ్యయనం చేసినట్లు ఆమెకు తెలిపారు. మణిపూర్ ప్రజలు సామాజిక విభజనల బాధితులని, వారి విషయంలో సానుభూతితో వ్యవహరించాలని కోరారు. అన్ని రాజకీయ పార్టీలు, సామాజిక వర్గాలు, మహిళా-పౌర సంఘాలు, విద్యా-ఆరోగ్య రంగాల ప్రతినిధులతో కలిసి విస్తృతస్థాయి చర్చలు జరిపినట్లు వెల్లడించారు. వెళ్లిన ప్రతిచోట శాంతి, సామరస్యం, ఐక్యత కోసం పిలుపునిచ్చినట్లు ముర్ముతో రాజా అన్నారు. అనేక శిబిరాలను సందర్శించామని, అవి అధ్వాన్న పరిస్థితుల్లో ఉన్నాయని, మహిళలు, పిల్లలు, వృద్ధుల కోసం ఏర్పాట్లు లేవని, అరకొర వసతులతో వారు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారన్నారు. విద్యావ్యవస్థ కుదేలు కాగా యువతరం భవిష్యత్ దెబ్బతింటోందన్నారు. అక్రమ మాదక ద్రవ్యాల రవాణా, సాగు జరుగుతుండటం సమస్యగా మారిందని, భూమి, అడవులు, సహజ వనరులకు ముప్పు ఏర్పడిందని, అక్రమ వలసలు, సరిహద్దు కంచె సమస్య వంటివి స్థానికులు ప్రస్తావించినట్లు తెలిపారు. మణిపూర్ ప్రజల వెతలను ఆ రాష్ట్ర గవర్నర్ అనసూయ ఉయికె దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. మణిపూర్ ప్రజల డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని రాష్ట్రపతికి అందజేశారు. రాజా వెంట సీపీఐ కార్యదర్శులు వినయ్ విశ్వం, డా॥ కె.నారాయణ, రామకృష్ణ పాండా, సీనియర్ నాయకురాలు అసోమీ గొగోయ్ ఉన్నారు. రాష్ట్రపతిభవన్ నుంచి బయటకు వచ్చి తర్వాత నాయకులు మీడియాతో మాట్లాడుతూ మణిపూర్ సమస్య పరిష్కారానికి సానుభూతిలో చర్యలు తీసుకోవాలని రాష్ట్రపతిని కోరినట్లు తెలిపారు. మణిపూర్ ప్రజలు చేసిన ప్రధాన డిమాండ్లలో అసెంబ్లీలో అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించాలని, సత్వరమే శాంతి, సాధారణ పరిస్థితులను నెలకొల్పాలని, అన్ని సామాజిక వర్గాలు, రాజకీయ పార్టీ, పౌర సంఘాలతో చర్చించి ప్రతిష్ఠంభనను తొలగించాలని, అన్ని వర్గాల నిరాయుధీకరణకు వెంటనే చర్యలు తీసుకోవడానికి, సహాయ, పునరావాసానికి ప్రత్యేక ప్యాకేజి, హింస బాధితులకు సముచిత పరిహారం అందించాలని, అత్యాచారాలు, హత్యలు, హింసకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యాసంస్థలను తెరవాలని, ఇంటర్నెట్ సేవలను పునరుద్ధరించాలని, మహిళలకు ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేయాలని, వైద్యసేవలు, మందుల నిరంతరాయ సేవలు, హెమోఫిలియా, కేన్సర్, మూత్రపిండాల రోగులు, మధుమేహులు, అధిక రక్తపోటు తదితర వ్యాధిగ్రస్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నవి ఉన్నట్లు సీపీఐ నాయకులు తెలిపారు. ఆ రాష్ట్రంలో హక్కుల కార్యకర్తలు, జర్నలిస్టులు, మేధావులపై బీజేపీ ప్రభుత్వం ఉక్కుపాదం మోపడాన్ని ఆక్షేపించారు. ఈ తరహా నమోదైన అన్ని కేసులను ఎత్తి వేయాలని, మణిపూర్ వెళ్లిన ఎన్ఎఫ్ఐడబ్ల్యూ కార్యకర్తలపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు.

జీపీఎస్ మాకొద్దు...

- స్పష్టం చేసిన ఉద్యోగ సంఘాలు
- పాత పెన్షన్ విధానం అమలుకు డిమాండ్
- మంత్రుల కమిటీతో చర్చలు విఫలం
- బహిష్కరించిన ఉపాధ్యాయ సంఘాలు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ (జీపీఎస్)పై మంత్రుల కమిటీ సమావేశాన్ని ఉపాధ్యాయ సంఘాలు బహిష్కరించగా, వివిధ ఉద్యోగ సంఘాల నేతలు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో మంగళవారం జీపీఎస్‌పై మంత్రుల కమిటీ సమావేశం ముగిసింది. ఉపాధ్యాయ ప్రధాన సంఘాలైన ఎస్టీయూ, యూటీఎఫ్, ఏపీటీఎఫ్ ఈ

- మిగతా 2 లో

కరువు ఛాయలు

దేశవ్యాప్తంగా ముంచుకొస్తున్న ముప్పు

- జాడలేని వానలు... కొనసాగుతున్న వేడిమి
- సగానికి పైగా రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి

న్యూదిల్లీ: దేశంలో కరువు ఛాయలు అలుము కున్నాయి. ఉత్తర భారతదేశంలో భారీ వర్షాలు కురవడంతో వరదలు వచ్చినప్పటికీ దాదాపు సగానికి పైగా రాష్ట్రాలు వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. దేశంలో 80 శాతం వర్షపాతానికి కారణమైన నైరుతి రుతుపవనాలు జూన్ 8న కేరళలో ప్రారంభమయ్యాయి. దాని కాలం సెప్టెంబరు చివరి వరకు కొనసాగుతుంది. ఆగస్టు 1-ఆగస్టు 21 మధ్య దేశంలో 115.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. అయితే ఈ ఏడాది ఆగస్టు 123 సంవత్సరాలలో అత్యంత పొడి వాతావరణంతో కూడిన నెలగా మారవచ్చని ఒక వాతావరణ నిపుణుడు తెలిపారు. ప్రస్తుతం అదే పరిస్థితి స్పష్టమవుతోంది. పశ్చిమ అవాంతరాలు, రుతుపవనాల సమ్మేళనం ఉత్తర భారతదేశంలో భారీ వర్షాలను కురిపించింది. ఈ ప్రాంతాన్ని సంవత్సరంలో ఈ సమయానికి మిగులు వర్షాలుగా మార్చాయి. విపరీతమైన వర్షం, ఆకస్మిక వరదలు, కొండ చరియలు విరిగిపడే అవకాశం ఉన్న హిమాలయ రాష్ట్రాలకు, ముఖ్యంగా హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లకు వినాశకరమైన నెలగా ఆగస్టు ఉంది. అయితే తెలంగాణ, కేరళ, కర్నాటక, బీహార్, ఉత్తర ప్రదేశ్, బీహార్, ఆంధ్ర ప్రదేశ్ వంటి వంటి 12 మధ్య, దక్షిణ, ఈశాన్య రాష్ట్రాలు ఇప్పటికీ వర్షాభావ పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. 'విరామ రుతుపవనాల పరిస్థితి కారణంగా ఆగస్టులోని మిగిలిన రోజులలో రోజువారీ దేశవ్యాప్త

- మిగతా 2 లో

ముందస్తు తప్పదేమో...

- పొత్తులు ఏ పార్టీతోనో ఇప్పుడే చెప్పలేను
- టీడీపీ గేట్లు తెరిస్తే వైసీపీ ఖాళీ
- మీడియాతో చంద్రబాబు చిట్‌చాట్

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ముందస్తు ఎన్నికలొచ్చే అవకాశం ఉందని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. దిల్లీలో మంగళవారం ఆయన మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఎన్నికల్లో పొత్తులపై ప్రశ్నించగా జనసేన సహా ఏ పార్టీతో పొత్తులుం టాయో ఇప్పుడే చెప్పలేనని చంద్రబాబు తెలిపారు. రాజకీయాల్లో సమయాన్ని బట్టే కీలక నిర్ణయాలుం టాయన్నారు. వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. టీడీపీ గేట్లు తెరిస్తే వైసీపీ మొత్తం ఖాళీ అవుతుందన్నారు. మూడు రాజ ధానుల పేరుతో రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని మండిపడ్డారు. రాష్ట్ర విభజన తర్వాత ప్రణాళికబద్ధంగా ఏపీని అభివృద్ధి చేయాలని భావించానని, శరవేగంగా అభివృద్ధి చెందుతున్న దశలో వైసీపీ అధికారంలోకి రావడంతో రాష్ట్రం సర్వనాశనమైందని విమర్శించారు. ప్రపంచంలోనే అత్యంత ఆధునిక ప్రణాళికతో నిర్మితమయ్యే అమరావతిని ధ్వంసం చేశారని, రాష్ట్రానికి కీలకమైన పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని నిలిపి వేశారని, పోలవరం పూర్తిచేసి నదులను అనుసంధానం చేస్తే ఉత్తమ రాష్ట్రంగా ఏపీ నిలిచేదని చంద్రబాబు చెప్పారు. జగన్ ఒక శాడిస్ట్, కరుడుగట్టిన నేరస్తుడు, సొంత బాబాయిని చంపి తనపై నిందలు మోపారని ఆరోపించారు. రఘురామ కృష్ణరాజును సీబీసీఐడీ చిత్రహింసలకు గురిచేస్తుంటే జగన్ ఆ వీడియోలు చూసి శాడిస్టులా ఆనందం పొందారన్నారు. రాజకీయాల్లో జగన్ ఒక బచ్చా అని, రాజకీయంగా ఆయనకు ఉన్న అనుభవం ఎంత అని ప్రశ్నించారు. రాష్ట్రానికి ఉన్న పెద్ద సమస్య జగనేనని, రాష్ట్రం బాగుపడాలంటే జగన్‌ను గద్దెదించాలని చంద్రబాబు అన్నారు. తనపై ఎన్ని

- మిగతా 2 లో

ఇదీ లోకం!

మన ఎమ్మెల్యేలను, ఎంపీలను, మంత్రులను కూడా చదివించండి సార్!

రాష్ట్రంలో అరాచక పాలన

- నిధులన్నీ తాడేపల్లి ప్యాలెస్‌కు...
- ఎన్‌డీఏ హయాంలో దేశం అప్పల పాలు
- మోదీలో చంద్రబాబుకు కనిపించిన మంచి ఏమిటి?
- నెల్లూరు బహిరంగ సభలో రామకృష్ణ

ఆంధ్రప్రదేశ్‌లో అరాచక పాలన కొనసాగుతోందని, బీజేపీ ప్రభుత్వం దేశాన్ని అప్పులపాలు చేసిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. సీపీఐ తలపెట్టిన బస్సుయాత్ర మంగళవారం నెల్లూరుకు చేరుకుంది. టౌన్‌హాలులో నిర్వహించిన సభలో రామకృష్ణ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై మోయలేని భారాలు మోపారని మండిపడ్డారు. నాలుగున్నరేళ్లలో ఏడుసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచిన ఘనత జగన్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు.

8 లో

అసాంజెను తక్షణమే విడిపించాలి

ఆస్ట్రేలియా ప్రధానికి తొమ్మిది మంది మాజీ అటార్నీ జనరళ్ల బహిరంగ లేఖ

సిడ్నీ: 'వికీలీక్స్ వ్యవస్థాపకుడు జులియన్ అసాంజె నిర్బంధం ఇంకెంత కాలం? ఆయనను తక్షణమే విడిపించాలి. అమెరికా న్యాయవ్యవస్థ దయాదాక్షిణ్యానికి వదిలివేయడం సరైన పద్ధతి కాదు. ఒకవేళ అక్కడ ఆయన దోషిగా రుజువైతే జైల్లోనే చనిపోతారు' అని తొమ్మిది మంది మాజీ అటార్నీ జనరళ్లు కలిసి ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్‌కు బహిరంగ లేఖ పంపారు. అసాంజెను తక్షణమే విడిచిపించాలని ఐక్యంగా డిమాండ్ చేశారు. వాస్తవాలను కప్పిపుచ్చేందుకు శక్తిమంతమైన దేశాలు ఏమైనా చెయ్యగలవని, స్వార్థపూరితంగా వ్యవహరిస్తూ ఎవరికి ఎంత నష్టం కలుగుతుందో పట్టించుకోవని వ్యాఖ్యానించారు. ఓ ఆస్ట్రేలియా పౌరుడిని అపరిమిత కాలం పాటు నిర్బంధంలో ఉంచడం అమానవీయంగా పేర్కొన్నారు. అసాంజె విషయంలో 13ఏళ్లుగా అమెరికా తాత్సారం చేస్తోందని, ఆయనకు ఎలాంటి మినహాయింపులు ఇచ్చే ఉద్దేశం అమెరికా అధ్యక్షుడు జోబైడెన్‌కు లేదని బహిరంగ లేఖలో మాజీ అటార్నీల జనరళ్లు తెలిపారు. అసాంజెను హైటెక్ ఉగ్రవాదిగా బైడెన్ వ్యాఖ్యానించడాన్ని గుర్తుచేశారు. నాలుగేళ్లుగా బ్రిటన్‌లోని బెల్‌మార్ష్ జైల్లో మగ్గుతూ అమెరికాకు అప్పగింత కోసం ఎదురుచూస్తున్న అసాంజెను విడిపించడానికి క్యాన్‌బెర్రా తగు చర్యలు తీసుకోవడం అనివార్యమని ప్రధానికి రాసిన లేఖలో కోరారు. అమెరికా దయకు వదిలేస్తే ఆయన జైల్లోనే చనిపోతారని ఆవేదన వ్యక్తంచేశారు. ఆస్ట్రేలియాలోని లేబర్ ప్రభుత్వం అనేకసార్లు అసాంజె వ్యవహారంలో గళమెత్తిందని, ఆయన కోసం మరింత కసరత్తు అవసరమని ఆస్ట్రేలియా మాజీ దౌత్యాధికారి అలిసన్ బ్రోనోవిస్కీ వ్యాఖ్యానించారు. ఇటీవల వాషింగ్టన్‌లో అసాంజె గురించి ప్రస్తావించినా ఫలితం లేదన్నారు. ఆస్ట్రేలియా తీరు అమెరికా సార్వభౌమాధికారానికి లొంగుబాటుకు సంకేతమని, ఇది ఆస్ట్రేలియాలోని అనేకమందికి తలవంపుగా పేర్కొన్నారు. లేఖ రాసిన వారిలో 2011 జనవరి నుంచి 2014 మార్చి వరకు టాస్మానియా ప్రధానిగా పనిచేసిన లారా గిడింగ్స్ ఉన్నారు. లారా స్పందిస్తూ అసాంజె గురించి ప్రజా అభిప్రాయం ముఖ్యం కాదు. ఆయన 11 ఏళ్లుగా స్వాతంత్ర్యాన్ని కోల్పోయారన్నది ప్రధానం. అసాంజె సంస్థ ద్వారా 'లీక్స్' తప్పా, ఒప్పా అన్నది పక్కకు పెడితే ఓ వ్యక్తిని ఏళ్ల తరబడి నిర్బంధంలో ఉంచడం, హక్కులను నిరాకరించడం అమానవీయం. అమెరికా న్యాయవ్యవస్థ దయకు వదిలివేయడం అనుచితం. ఒకవేళ అమెరికా కోర్టులో దోషిగా రుజువైతేగనుక అసాంజె జైల్లోనే చనిపోతారు' అని పేర్కొన్నారు. ఆస్ట్రేలియా పౌరుడి నిరవధిక నిర్బంధం ముగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని బహిరంగ లేఖలో ప్రధానిని తొమ్మిది మంది మాజీ అటార్నీ జనరళ్లు డిమాండ్ చేశారు.

ఇమ్రాన్ ఖాన్‌కు ఊరట

తోషాఖానా కేసులో మూడేళ్ల శిక్ష రద్దుకు హైకోర్టు ఆదేశం

ఇస్లామాబాద్: తోషాఖానా కేసులో పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు ఊరట లభించింది. ఆ కేసులో మూడేళ్ల శిక్షను రద్దు చేస్తూ మంగళవారం ఇస్లామాబాద్ హైకోర్టు ఆదేశాలిచ్చింది. ప్రధాన న్యాయమూర్తి అమీర్ ఫరూక్, జస్టిస్ తారిక్ మెహమూద్ జహంగిరితో కూడిన డివిజన్ బెంచి ఈ మేరకు ఉత్తర్వులను జారీచేసింది. తోషాఖానా కేసులో తనకు విధించిన మూడేళ్ల శిక్షను సవాల్ చేస్తూ ఇమ్రాన్ పెట్టుకున్న అర్జీని ఉన్నత న్యాయస్థానం విచారించింది. తోషాఖానా కేసులో ఇస్లామాబాద్‌లోని ట్రయిల్ కోర్టు ఈనెల 5న ఇమ్రాన్‌కు మూడేళ్ల శిక్ష విధించింది. ఈ తీర్పుతో ఆయన వచ్చే ఐదేళ్ల వరకు సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులవుతారు. దీంతో ఇమ్రాన్ ఖాన్ హైకోర్టుకు వెళ్లారు. ఈ కేసును తిరిగి ట్రయిల్ కోర్టుకు అప్పగించడాన్ని సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఇమ్రాన్ అరెస్టులో విధానపరమైన లోపాలను సుప్రీంకోర్టు గుర్తించింది. అయితే హైకోర్టు తీర్పు కోసం వేచిచూడాలని భావించింది. కిందిస్థాయి కోర్టుల్లో పెండింగ్ వ్యవహారాల్లో ఎవరి జోక్యం ఉండరాదని వ్యాఖ్యానించింది. ఎన్నికల కమిషన్ తరపున అడ్వకేట్ అంజత్ పర్వేజ్ తన వాదనలను ముగించారు. యంత్రాంగాన్ని ప్రతివాదిగా చేర్చుతూ నోటీసు జారీ చేయాలని న్యాయస్థానాన్ని కోరారు. ఇలా చేసేందుకు తమకు అభ్యంతరం లేదన్న ఇమ్రాన్ ఖాన్ తరపున లతీఫ్ ఖోసా.... చట్టప్రకారం దాని అవసరం కూడా లేదని చెప్పారు. ఇమ్రాన్ బయటకు వచ్చే ప్రసక్తే లేదని, ఇతర కేసుల్లో ఆయనకు శిక్ష తప్పబోదని అంతర్గత శాఖ మంత్రి రానా సనావుల్లా ఎక్స్ మాధ్యమంగా సోమవారం రాత్రి వ్యాఖ్యలు చేశారు. కాగా, తాజా కోర్టు విచారణకు ముందుగా పీటీఐ న్యాయవాదులు బాబర్ అవాన్, సల్మాన్ సఫ్దార్ ఇస్లామాబాద్ హైకోర్టుకు చేరుకొని అక్కడ మీడియాతో మాట్లాడారు. తమ పోరాటం ఒక కేసు, ఒక తీర్పు కోసం కాదని చెప్పారు. 'మీరంతా పెద్ద బందీఖానాలో ఉన్నారు. మీ అందరికి స్వేచ్ఛ కల్పించాలని కోరుకుంటున్నాం' అని తెలిపారు.

పిల్లలకు పాఠాలుగా జిన్‌పింగ్ ఆలోచనలు

బీజింగ్: చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆలోచనలను ఆ దేశంలోని ఉన్నత స్థాయి విద్యార్థులకు పాఠాలుగా నేర్పబోతున్నారు. కొత్త యుగానికి చైనా లక్షణాలతో సోషలిజంపై జిన్‌పింగ్ ఆలోచనలను సమగ్ర, వ్యూహాత్మక పద్ధతిలో ఓ పాఠ్యపుస్తకం ప్రచురితమైంది. అదిప్పుడు అందుబాటులోకి వచ్చింది. హయ్యర్ ఎడ్యుకేషన్ ప్రెస్, పీపుల్స్ పబ్లిషింగ్ హౌస్ సంయుక్తంగా ఈ పాఠ్యపుస్తకాన్ని ముద్రించాయి. చైనా లక్షణాలతో తత్వశాస్త్రం, సామాజిక శాస్త్రాల బోధనకు ఇది ఎంతగానో దోహదమవుతుంది. పుస్తకంలో జిన్‌పింగ్ గురించి విస్తృతంగా వివరించారు. సైద్ధాంతిక మేధావులు, నిపుణులు... యువ, మధ్య వయస్సుగల టీచర్లతో సమన్వయం చేసుకొని ఈ పాఠ్యపుస్తకాన్ని రూపొందించారు. యువ తరానికి అర్థమయ్యేలా అందులోని అంశాలను తీర్చి దిద్దారు.

చంద్రుడిపై సల్ఫర్ ఆనవాళ్లు

బెంగళూరు: అంతరిక్ష పరిశోధనలో చంద్రయాన్-3 ప్రయోగం భారతదేశాన్ని మరింత ముందంజలో నిలిపేలా ప్రజ్ఞాన్ రోవర్ పరిశోధన సాగుతోంది. ప్రజ్ఞాన్ రోవర్ లేజర్-ప్రేరిత బ్రేక్‌డౌన్ స్పెక్ట్రోస్కోప్ (ఎల్ఐబీఎస్) పరికరం దక్షిణ ధ్రువానికి సమీపంలో ఉన్న చంద్రుని ఉపరితలంలో సల్ఫర్ ఉనికిని మొదటిసారిగా ఇన్-సిటీ కొలతల ద్వారా నిర్ధారించిందని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మంగళవారం తెలిపింది. రోవర్ స్పెక్ట్రోస్కోప్ ఊహించిన విధంగా అల్యూమినియం, కాల్షియం, ఫెర్రస్ (ఐరన్), క్రోమియం, టైటానియం, మాంగనీస్, సిలికాన్, ఆక్సిజన్‌లను కూడా గుర్తించిందని వివరించింది. అయితే హైడ్రోజన్ కోసం అన్వేషణ సాగుతోందని తెలిపింది. 'ప్రాథమిక విశ్లేషణలు గ్రాఫికల్‌గా సూచించబడ్డాయి. చంద్రుని ఉపరితలంపై అల్యూమినియం (ఏఐ), సల్ఫర్ (ఎస్), కాల్షియం (సీఏ), ఐరన్ (ఎఫ్ఈ), క్రోమియం (సీఆర్), టైటానియం (టీఐ) ఉనికిని ఆవిష్కరించాయి. తదుపరి కొలతలు మాంగనీస్ (ఎంఎన్), సిలికాన్ (ఎస్ఐ), ఆక్సిజన్ (ఒ) ఉనికిని వెల్లడించాయి. హైడ్రోజన్ ఉనికిపై సమగ్ర అన్వేషణ జరుగుతోంది' అని ఇస్రో తన ప్రకటనలో తెలిపింది. 'లిబ్స్ పరికరం ఎలక్ట్రో-ఆప్టిక్స్ సిస్టమ్స్ (ఎల్ఈఓఎస్)/ఇస్రో బెంగళూరు ప్రయోగశాలలో అభివృద్ధి చేయడం జరిగింది' అని ఇస్రో పేర్కొంది. ప్రజ్ఞాన్ రోవర్ చంద్రుని 'మరిన్ని రహస్యాలను వెలికితీసే మార్గంలో ఉంది' అని భారత అంతరిక్ష సంస్థ చెప్పిన తర్వాత ఈ పరిణామాలు వచ్చాయి. ఆగస్టు 23న చంద్రుని దక్షిణ ధ్రువంపై చంద్రయాన్-3 విజయవంతంగా ల్యాండింగ్ అయిన కొన్ని గంటల తర్వాత రోవర్ 'విక్రమ్' ల్యాండర్ నుంచి బయటకు వచ్చింది. నిన్న, ప్రజ్ఞాన్ రోవర్ చంద్రుని ఉపరితలంపై దాని స్థానానికి 3 మీటర్ల ముందున్న నాలుగు మీటర్ల వ్యాసం కలిగిన బిలం వద్దకు వచ్చిందని అంతరిక్ష సంస్థ తెలిపింది. ఆగస్టు 23న చంద్రుడి దక్షిణ ధ్రువాన్ని తాకిన తొలి దేశంగా భారత్ చరిత్ర సృష్టించింది.

ఎన్నికల తాయిలం

(మొదటిపేజీ తరువాయి)

కేంద్రంలోని మోదీ ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. అందులో భాగంగా గ్యాస్ సిలిండర్ ధరను తగ్గిస్తున్నట్లు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రకటించింది. ఎల్పీజీ సిలిండర్ ధరపై రూ.200 తగ్గించాలని మంగళవారం ప్రధాని మోదీ అధ్యక్షతన భేటీ అయిన కేంద్ర కేబినెట్ నిర్ణయించింది. బుధవారం నుంచి తగ్గింపు అమల్లోకి వస్తుంది. ఈ మేరకు కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ మంగళవారం ప్రకటించారు. ఓనం, రాఖీ పండుగలను పురస్కరించుకొని మహిళలకు మోదీ ప్రభుత్వ కానుకగా గ్యాస్ సిలిండర్ ధర తగ్గింపును వర్తించారు. అదే సమయంలో చంద్రుడి దక్షిణ ధ్రువంపై చంద్రయాన్-3కి చెందిన ల్యాండర్ విక్రమ్, రోవర్ ప్రజ్ఞాన్ సజావుగా దిగి చరిత్ర సృష్టించినందుకు కేంద్రకేబినెట్ భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం (ఇస్రో) శాస్త్రవేత్తలను ప్రశంసించింది. ఈ విజయం ఇస్రోదే కాబోదని, భారత పురోగతికి, అంతర్జాతీయ స్థాయికి దేశ ప్రతిష్ఠను పెంచడానికి చిహ్నమని పేర్కొంది. ఈ ఘనత సాధించిన ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినంగా జరుపుకోవాలన్న నిర్ణయాన్ని స్వాగతించింది. దీనిపై తీర్మానాన్ని ఆమోదించింది. ఠాకూర్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి కాస్త ఉపశమనం కల్పించడమే ఉద్దేశమన్నారు. అదనంగా 75 ఉజ్వల కనెక్షన్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ నిర్ణయానికి ఎన్నికలతో సంబంధం లేదని ఠాకూర్ తెలిపారు. సిలిండర్‌పై రూ.200 చొప్పున వినియోగదారులకు సబ్సిడీ ఇవ్వడం ద్వారా ఖజానాపై రూ.7,680 కోట్ల భారం (2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు) పడుతుందని ఆయన చెప్పారు. దేశంలో ఉజ్వల లబ్ధిదారులు 9.6 కోట్ల మంది మాత్రమే కాగా 31కోట్ల మంది వంటగ్యాస్ వినియోగదారులకు కూడా ఈ తగ్గింపు వర్తిస్తుంది. 2020 జూన్ నుంచి ఎల్‌పీజీ సబ్సిడీలను కేంద్రం ఆపేసింది. మార్కెట్ ధరకు సిలిండర్ విక్రయిస్తోంది. చంద్రయాన్-3 సాధించిన ఘనతపై కేంద్ర కేబినెట్ హర్షం వ్యక్తం చేసినట్లు ఠాకూర్ తెలిపారు. శాస్త్రవేత్తల చారిత్రక విజయానికి తగిన గుర్తింపు ఇవ్వాలని ఆగస్టు 23ను 'నేషనల్ స్పేస్ డే' జరుపుకోవడానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. పురోగతి, స్వీయసమృద్ధి, అంతర్జాతీయ నాయకత్వానికే కాదు నవభారత వికాసానికి ఇది చిహ్నమని కేబినెట్ పేర్కొన్నట్లు తెలిపారు.

నా సోదరీమణుల కోసమే: మోదీ

రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని కుటుంబ సంతోషం పెంచాలనే ఉద్దేశంతో, సోదరీమణులకు మరింత సౌకర్యం కల్పించేందుకు వంట గ్యాస్ సిలిండర్ ధరపై రూ.200 తగ్గిస్తున్నట్లు ప్రధాని మోదీ 'ఎక్స్' మాధ్యమంగా తెలిపారు. ఈ నిర్ణయంతో కుటుంబాల ఆర్థిక భారం తగ్గుతుందని పేర్కొన్నారు.

ఇది 'ఇండియా' దమ్ము: మమత

కోల్‌కతా: ఎల్పీజీ సిలిండర్ ధరపై రూ.200 తగ్గిస్తుండటం ఇండియా కూటమి ప్రభావం వల్లే అని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అన్నారు. 'ఇండియా కూటమి రెండు నెలల్లో రెండుసార్లు మాత్రమే భేటీ అయింది. ఈలోగా ఎల్పీజీ ధర రూ.200 మేర తగ్గింది. ఇది 'ఇండియా'కున్న దమ్ము' అని మమత ట్వీట్ చేశారు. లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా వంట గ్యాస్ ధర తగ్గింపు ఎన్నికల జిమ్మిక్ అని టీఎంసీ అధికార ప్రతినిధి కునాల్ ఘోష్ వ్యాఖ్యానించారు.

కరువు ఛాయలు

(మొదటిపేజీ తరువాయి)

వర్షపాతం సగటు కంటే తక్కువగా ఉంటుంది. అందువల్ల 2023 రికార్డులో కొత్త పొడి ఆగస్టుగా మారడానికి చాలా ఎక్కువ అవకాశం ఉంది' అని యునైటెడ్ కింగ్‌డమ్ రీడింగ్ యూనివర్సిటీలో శాస్త్రవేత్త అక్షయ్ దేవరాస్ అన్నారు. కేరళలో నైరుతి రుతుపవనాల వర్షపాతం లోటు 47 శాతం వద్ద ఉంది. ఈ సంవత్సరం రాష్ట్రం కరవు శిఖరాగ్రంలో ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) పేర్కొంది. జూన్ 1-ఆగస్టు 25 మధ్య కేరళలో 894.1 మిమీ వర్షపాతం సాధారణం 1,681.7 మి.మీ నమోదయింది. ఇది 47 శాతం లోటు. కేరళ రాష్ట్ర విపత్తు నిర్వహణ మండలి వాతావరణ శాస్త్రవేత్త రాజీవ్ ఎరిక్కుళం మాట్లాడుతూ ఆగస్టు చివరి నాటికి సమాచారం క్రోడీకరించినప్పుడు, ఐఎండీ 123 సంవత్సరాల చరిత్రలో ఈ నెలలో ఎన్నడూ లేనంత తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. 'రుతుపవనాలు జూన్‌లో 8 రోజులు ఆలస్యంగా వచ్చాయి. బిపార్జోయ్ తుపాను ఏర్పడటంతో వర్షపాతం ప్రభావితమైంది. ఫలితంగా ఈ ఏడాది జూన్‌లో 60 శాతం లోటు వర్షపాతం నమోదయింది. కానీ జులైలో ముఖ్యంగా ఉత్తరాది జిల్లాల్లో వర్షాలు కురిశాయి. ఇది లోటును గణనీయంగా తగ్గించింది' అని ఎరిక్కుళం చెప్పారు. ఇదే కాలంలో దేశవ్యాప్తంగా వర్షపాతాన్ని పరిశీలిస్తే, ఇప్పటివరకు నైరుతి రుతుపవనాల వర్షపాతం కంటే కేరళలో అత్యధిక లోటు ఉందని నిర్ధారిస్తుంది. ఈశాన్య ప్రాంతంలోని మణిపూర్ 46 శాతం లోటు వర్షపాతంతో రెండవ స్థానంలో ఉండగా, జార్ఖండ్, లక్షద్వీప్‌లు 34 శాతం లోటుతో రెండవ స్థానంలో ఉన్నాయి. వాతావరణ పరిస్థితుల కారణంగా సెప్టెంబరులో వర్షాలు కురిసే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. 'కానీ సెప్టెంబరులో కురిసిన వర్షపాతం ఈ సంవత్సరం కాలానుగుణ లోటును భర్తీ చేసే అవకాశం లేదు. సాధారణం నుంచి నిష్క్రమణ దాదాపు 50 శాతం. అందువల్ల ఇది అసంభవం' అని అంటున్నారు. పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు లేకపోవడం వల్ల కేరళ రాష్ట్రంలోని కొన్ని పెద్ద రిజర్వాయర్లు, డ్యామ్‌లలో నిల్వ స్థాయిలు పడిపోయాయి. రాష్ట్రంలో కరవు పరిస్థితులు నెలకొనే అవకాశం ఉందని, ప్రజల, ముఖ్యంగా రైతుల సమస్యలను పరిష్కరించడానికి తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి ఉన్నత స్థాయిలో చర్చలు జరుగుతున్నాయని కేఎస్‌డీఎంఏ అధికారి ఒకరు తెలిపారు. 'పరిస్థితిని పర్యవేక్షిస్తున్నాము. వర్షపు నీటి సేకరణను తీవ్రతరం చేయడానికి జిల్లా స్థాయిలో ఆదేశాలు ఇచ్చాము' అని ఆయన చెప్పారు. ఐఎండీ సమాచారం ప్రకారం, ఈ సీజన్‌లో తమిళనాడు మినహా అన్ని దక్షిణాది రాష్ట్రాల్లో ఆశించిన దానికంటే తక్కువ వర్షపాతం నమోదయింది. జులై మొదటి వారంలో దక్షిణాదిలో భారీ వర్షాలు కేరళ, కర్నాటక తీర ప్రాంతాలకు పరిమితం అయ్యాయి. ప్రధాన భూభాగంలో గణనీయమైన వర్షపాతం లేదు. తెలంగాణ, ఆంధ్ర, కర్నాటక, కేరళలోని కొన్ని ప్రాంతాల్లో పంటల విత్తడం ఆలస్యమైంది. గత సంవత్సరంతో పోలిస్తే, తెలంగాణాలో 65 శాతం వర్షపాతం లోటు నమోదయినట్లు గణాంకాలు పేర్కొంటున్నాయి. జూన్ 24 నుంచి రుతుపవనాలు ప్రారంభమమైనప్పటికీ అస్థిరంగానే ఉన్నాయి. వికారాబాద్, సంగారెడ్డి, సిద్దిపేట, నారాయణపేటలో ఇప్పటివరకు సాధారణం కంటే కొంచెం ఎక్కువ వర్షపాతం నమోదు కాగా, మిగిలిన 29 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదయింది. ఇక కర్నాటకలో బెంగళూరుకు ముఖ్యమైన నీటి వనరు, తాగునీటి అవసరాల కోసం కావేరి నీటిని సరఫరా చేసే కృష్ణరాజసాగర్ (కేఆర్ఎస్) డ్యామ్ వంటి చాలా ప్రధాన డ్యామ్‌లు గరిష్ఠంగా 30 అడుగుల కంటే తక్కువ నీటి మట్టంతో దాదాపు ఎండిపోతున్నాయని అధికారులు తెలిపారు. హైదరాబాద్, కర్నాటక ప్రాంతాలకు ఉపయోగపడే తుంగభద్ర డ్యామ్‌లో కూడా తక్కువ నీటి మట్టం ఉంది. కర్నాటకలోని కావేరి, తుంగభద్ర వంటి నదులను తిరిగి నింపే పరీవాహక ప్రాంతాలు రుతుపవనాల సీజన్‌లో మొదటి 35 రోజులలో సాధారణ వర్షపాతం కంటే మూడింట ఒక వంతు కంటే తక్కువగా కురిసినట్లు కర్నాటక రాష్ట్ర సహజ విపత్తు పర్యవేక్షణ విభాగం తెలిపింది. తూర్పు రాష్ట్రాలు బీహార్, జార్ఖండ్, ఒడిశా కూడా లోటు వర్షపాతాన్ని ఎదుర్కొం టున్నాయి. అయితే పశ్చిమ బెంగాల్‌లో గణనీయమైన వర్షపాతం ఉంది. అసోం మినహా అన్ని ఈశాన్య రాష్ట్రాలు వర్షాభావాన్ని కలిగి ఉన్నాయి. అరుణాచల్ ప్రదేశ్‌లో ఈ రుతుపవనాల సీజన్‌లో 484 మి.మీ వర్షపాతం నమోదయింది. ఇది సాధారణం కంటే తక్కువ.

తెలంగాణలో 1972 తర్వాత అత్యల్పం

తెలంగాణలో 1972 తర్వాత ఆగస్టులో తెలంగాణలో అత్యల్పంగా వర్షపాతం నమోదయింది. ఆగస్టులో కేవలం 74.4 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదు కాగా, ఇది సాధారణం కంటే 60 శాతం తక్కువ. 1960 నుంచి రాష్ట్రంలో ఇంత తక్కువగా వర్షపాతం నమోదవడం ఇది మూడోసారి. 1960లో 67.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవగా... 1968లో 42.7 మిల్లీమీటర్లు, 1972లో 83.2 మిల్లీమీటర్లు.. ప్రస్తుతం ఆగస్టులో 74.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. సాధారణంగా తెలంగాణలో 120 రోజులు వర్షాకాలం ఉంటుందని, 60-70 రోజులు మంచి వర్షాలు కురుస్తాయని, మిగతా రోజుల్లో అడపదడపా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ నిపుణులు పేర్కొంటున్నారు.

సెప్టెంబరులోనూ వర్షాలు లేనేట్టేనా?

ఎనిమిదేళ్ల తర్వాత ఈ ఏడాది రుతుపవనాలు అత్యంత బలహీనంగా మారాయి. ఎల్‌నినో ప్రభావం కారణంగా సెప్టెంబరులోనూ వర్షాలు ఎక్కువగా కురిసే అవకాశం లేదని, ఇప్పటికే ఆగస్టు నెలంతా వాతావరణం పొడిగానే ఉందంటూ వాతావరణ శాఖ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. వాస్తవానికి ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ఆలస్యంగా వచ్చాయి. దీంతో దేశంలో ఈ ఏడాది జూన్‌లో లోటు వర్షపాతం ఏర్పడింది. ఆ తర్వాత రుతుపవనాలు చురుగ్గా మారడంతో దేశవ్యాప్తంగా అత్యధిక వర్షపాతం నమోదయింది. సాధారణ సగటు కంటే జూన్‌లో తొమ్మిది శాతం తక్కువ లోటు ఉండగా... జులైలో 13 శాతం ఎక్కువగా నమోదయింది. మరో వైపు సెప్టెంబరు 17 నుంచి రుతుపవనాలు వెనక్కి మళ్లనున్నాయి. తూర్పు, ఉత్తరాది రాష్ట్రాల్లో సాధారణం కంటే తక్కువ వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ అంచనా వేస్తున్నది. వార్షిక సగటు వర్షపాతం 70 శాతం రుతుపవనాల సమయంలోనే నమోదవుతుండటం గమనార్హం. వర్షపాతం తగ్గితే నిత్యావసర చక్కెర, పప్పులు, కూరగాయల ధరలు పెరిగే అవకాశం అవకాశం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆంధ్రాలోనూ అదే పరిస్థితి

ఆంధ్ర ప్రదేశ్‌లో కూడా లోటు వర్షపాతం కనిపిస్తోంది. నైరుతి రుతుపవనాల సీజన్‌లో మొదటి రెండు నెలల్లో (జూన్-జులై) సంచిత వర్షపాతం 210.7 మి.మీలకు చేరుకుంది. ఇది సాధారణం 225.2 మి.మీ కంటే 6 శాతం తక్కువ. రాష్ట్రంలోని మొత్తం 26 జిల్లాల్లో మూడు కోస్తా జిల్లాలు, రాయలసీమ ప్రాంతంలోని నాలుగు జిల్లాలు వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. తిరుపతి జిల్లాలో 44 శాతం, అన్నమయ్య జిల్లాలో 29 శాతం, నెల్లూరు, వైఎస్ఆర్ కడప జిల్లాల్లో 26 శాతం, ప్రకాశం జిల్లాలో 21 శాతం, పల్నాడు జిల్లాలో 20 శాతం లోటు వర్షపాతం నమోదయింది. రాష్ట్రంలోని రాయలసీమ ప్రాంతంలో 14 శాతం (140.6 మి.మీ సాధారణం కంటే 164.4 మి.మీ) లోటు నమోదు కాగా, రాష్ట్రంలోని కోస్తా ప్రాంతంలో ఒక శాతం అధిక వర్షపాతం (268.1 సాధారణానికి వ్యతిరేకంగా 271.2 మి.మీ) నమోదయినట్లు వాతావరణ శాఖ గణాంకాలు పేర్కొన్నాయి. రాయలసీమ, ఉత్తర కోస్తా ఆంధ్ర ప్రదేశ్‌లోని అనేక ప్రాంతాల్లో రైతులు రుతుపవన వర్షాలపైనే ఆధారపడుతున్నారు. రాష్ట్రంలో వర్షపాతం లోటు 22 శాతం (జులై 24న) నుంచి జులై 31 నాటికి 6 శాతానికి తగ్గింది.

పోలవరంపై కదలిక

దయాఫ్రం వాల్, గైడ్‌బండ్‌పై నాలుగైదురోజుల్లో కార్యాచరణ ప్రణాళిక

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పోలవరం ప్రాజెక్టుపై కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. దెబ్బతిన్న డయాఫ్రం వాల్, కుంగిన గైడ్‌బండ్ తదితర అంశాలపై నాలుగైదు రోజుల్లో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని కేంద్ర జలశక్తి శాఖ నిర్ణయించింది. పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిపై సీడబ్ల్యూసీ అధికారులతో మంగళవారం దిల్లీలో జలశక్తి శాఖ కార్యదర్శి భేటీ అయ్యారు. ప్రతి నెలా జాతీయ ప్రాజెక్టులపై జరిపే సమీక్షలో భాగంగా జరిగిన ఈ సమావేశంలో ప్రాజెక్టుకు సంబంధించిన కీలక అంశాలపై చర్చించారు. డయాఫ్రమ్ వాల్, అప్పర్, లోయర్ కాపర్ డ్యాంల పరిస్థితి, రెండు చోట్ల అవుతున్న నీటి లీకేజీ, కుంగిన గైడ్‌బండ్, డయాఫ్రమ్ వాల్ దెబ్బతిన్న ప్రదేశంలో చేపట్టాల్సిన చర్యలు, ఇప్పటికే జలశక్తి శాఖ నుంచి ఇచ్చిన ఆదేశాల అమలు తీరుతెన్నులపై చర్చించారు. కార్యాచరణ ప్రణాళిక రూపొందించిన తర్వాత ప్రాజెక్టు నిర్మాణం కొనసాగించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ఈసమావేశం నిర్ణయించింది. జలశక్తి శాఖ సలహాదారు వెదిరే శ్రీరామ్‌కు యాక్షన్ ప్లాన్ తయారీ బాధ్యతలు అప్పగించారు. డయాఫ్రం వాల్, గైడ్‌బండ్‌పై అధ్యయనం చేస్తున్న సంస్థతో కార్యాచరణ రూపొందించాలని జలశక్తి శాఖ నిర్దేశించింది. తద్వారా ప్రాజెక్టు వద్ద లోటుపాట్లు బయటపడే అవకాశం ఉందని కేంద్రం భావిస్తోంది. జలశక్తి శాఖ నిర్వహించిన ఈ సమావేశానికి తొలుత రాష్ట్ర అధికారులను కూడా పిలవాలని అనుకున్నప్పటికీ చివరి నిమిషంలో వద్దనుకున్నట్లు సమాచారం. మంత్రిత్వ శాఖలో చర్చించిన తర్వాతనే రాష్ట్ర అధికారులకు తగిన ఆదేశాలు ఇవ్వాలని భావించారు. ఇప్పటివరకు పోలవరంలో చేపట్టిన పనులు, తలెత్తిన ఇబ్బందులు, ప్రాజెక్టు ప్రాంతంలో తాజా పరిస్థితి, సీడబ్ల్యూసీ ఇతర కేంద్ర సంస్థలు ఇచ్చిన నివేదికలన్నింటిపైనా ఈ సమావేశంలో చర్చించారు. జలశక్తి కార్యదర్శి పంకజ్‌కుమార్ నేతృత్వంలో జరిగిన ఈ భేటీలో ఆ శాఖ ముఖ్య సలహాదారు వెదిరె శ్రీరామ్, కేంద్ర జలసంఘం చైర్మన్ కుశ్వీందర్ వోరా, డ్యాం డిజైన్ రివ్యూ ప్యానెల్ (డీడీఆర్‌పీ) చైర్మన్ ఏబీ పాండ్య తదితరులు పాల్గొన్నారు. 2019 ఫిబ్రవరిలో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ పరిధిలోని సాంకేతిక సలహా కమిటీ (టీఏసీ) 45.72 మీటర్ల కాంటూరులో నిర్మాణాలు, భూసేకరణ, సహాయ పునరావాసం కోసం ఆమోదించిన రూ.55,548.87 కోట్ల అంచనా వ్యయాన్ని రూ.47,725.47 కోట్లకు కుదించింది. ఈ ఏడాది మే 5న 41.15 మీటర్ల కాంటూరులో డయాఫ్రం వాల్ మరమ్మతులు, హెడ్‌వర్క్స్ పనులు, భూసేకరణ, సహాయ పునరావాసానికి రూ.10,911 కోట్లను మంజూరు చేస్తున్నట్లు రాష్ట్రానికి కేంద్ర ఆర్థికశాఖ సమాచారం పంపింది. తర్వాత కేంద్ర మంత్రివర్గం ఆమోదం తర్వాతే నిధులు మంజూరవుతాయని మంత్రి తెలిపారు. ఈ అంశాలేవీ ఈ సమావేశంలో చర్చకు రానట్లు తెలిసింది.

జీపీఎస్ మాకొద్దు...

(మొదటిపేజీ తరువాయి)

సమావేశానికి హాజరు కాలేదు. ఇప్పటికే అనేకసార్లు జీపీఎస్‌పై మంత్రుల కమిటీ చర్చించినప్పటికీ కొలిక్కి రాలేదు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయా లని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. పాత పెన్షన్ కోసం అనేక ఉద్యమాలు చేసి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాయి. రెండు, మూడు రాష్ట్ర ప్రభుత్వాలు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తున్నాయి. అదే పద్ధతిని ఏపీ ప్రభుత్వం అమలు చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. దానిని పక్కదారి పట్టించేందుకుగాను జగన్ ప్రభుత్వం వ్యూహాత్మకంగా తెరపైకి జీపీఎస్‌ను తెచ్చింది. దీనిని ఇంతకు ముందు జరిగిన మంత్రుల కమిటీ సమావేశాల్లో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ప్రభుత్వం వెనక్కి తగ్గకుండా పదేపదే చర్చల ద్వారా ఉద్యోగులతో మైండ్‌గేమ్ ఆడుతోంది. ఏకపక్ష వైఖరితో ముందు కెళ్లడాన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా తప్పుపడుతున్నాయి. ప్రభుత్వ విధానాల్ని వ్యతిరేకించిన ఉద్యోగ సంఘాలపైన, ఆందోళనలకు దిగిన వారిపైనా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందనే విమర్శలున్నాయి.

పదేపదే చర్చలు విఫలం

జీపీఎస్‌పై మంత్రుల కమిటీ సమావేశంలో మరోసారి చర్చించినా ఫలితం లేకుండాపోయింది. చిత్తు ప్రతిని ఉద్యోగ సంఘాల నేతల ముందుం చలేదని చెబుతున్నారు. సమావేశానికి మంత్రులు బొత్స సత్యనారాయణ, బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, ఆదిమూలపు సురేష్ , సీఎస్ జవహర్‌రెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డితోపాటు ఆర్థికశాఖాధికారులు హాజరయ్యారు. జీపీఎస్‌ను ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకిస్తున్నప్పటికీ, దానిపై ప్రభుత్వం ఏకపక్ష వైఖరితో ముందుకెళ్లడంపై ఆ సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమావేశానికి ఏపీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, ఏపీ జేఏసీ అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఏపీ సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నేత వెంకట్రామిరెడ్డి, వివిధ ఉద్యోగ సంఘాల నేతలు హాజరయ్యారు. కాగా నలుగురు జేఏసీ నాయకులు సీపీఎస్ ఉద్యమానికి వెన్నుపోటు పొడిచారంటూ ఏపీ సీపీఎస్ఈఏ రాష్ట్ర జనరల్ సెక్రటరీ రాజేశ్వరరావు ఘాటుగా విమర్శించారు. నాడు సీపీఎస్ రద్దు చేస్తామని జగన్ చెప్పారని, దానిపై అడిగితే క్రిమినల్ కేసులు పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు: ఎస్టీయూ

సీపీఎస్ రద్దు చేస్తానన్న హామీ నెరవేర్చాలని, లేకుంటే ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్ తిమ్మన్న హెచ్చరించారు. పాత పెన్షన్ పునరుద్ధరణపై రాజకీయ నిర్ణయం తీసుకోకపోతే వచ్చే సాధారణ ఎన్నికల్లో ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు13 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్లు, వారి కుటుంబాలు సిద్ధంగా ఉన్నారన్నారు. పాత పెన్షన్‌ను ఆర్థిక భారంగా భావిస్తే దానికి తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

ఉద్యోగ సంఘాల సూచనల్ని పరిశీలిస్తాం

మంత్రి బొత్స సత్యనారాయణ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: జీపీఎస్ అంశంపై ఉద్యోగ సంఘాలతో జరిగిన చర్చల్లో మరిన్ని అంశాలు చేర్చాలని ఉద్యోగ సంఘాల కోరాయని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. ఉద్యోగ సంఘాల నేతలతో మంత్రివర్గ ఉప సంఘం భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఉద్యోగ సంఘాలతో చర్చలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని, వారు సూచించిన అంశాలపై అధ్యయనం చేశాక నిర్ణయం తీసుకుంటామన్నారు. ఉద్యోగుల సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. చంద్రబాబు వ్యాఖ్యలపై ఆయన స్పందిస్తూ, ఉగాది తర్వాత రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ఖాళీ అవుతుందన్నారు. తాము మేనిఫెస్టోలో ఇచ్చిన 98 శాతం హామీలను అమలు చేశామన్నారు. చంద్రబాబు నోరు అదుపులో పెట్టుకోవాలని, దిల్లీలో చంద్రబాబు తిరగడం లేదా? అని మండిపడ్డారు.

ముందస్తు తప్పదేమో...

(మొదటిపేజీ తరువాయి)

కేసులు ఉన్నాయో తెలుసుకునేందుకు ఆర్టీఐ ద్వారా సమాచారం కోరాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. జగన్ ప్రభుత్వ అవినీతి, అక్రమాలను ఎండగడుతున్నం దుకు కేసులపై కేసులు పెడుతున్నారని, తనపై భౌతిక దాడులు చేస్తున్నారని, పైగా తిరిగి తనపైనే హత్యాయత్నం కేసు నమోదు చేశారని చంద్రబాబు మండిపడ్డారు.

ఇండియా కూటమికి లీడర్ లేదు

'తొలి నుంచి టీడీపీ జాతీయ కూటమిల్లో భాగంగా ఉంది. ఇండియా కూటమి ఎలా ముందుకు వెళ్తుందో చూడాలి. ఇండియా కూటమికి లీడర్ లేకపోవడం బీజేపీకి అనుకూల అంశం. ఇండియా కూటమికి నాయకత్వం ఎవరు వహిస్తారనే దానిపై కామెంట్ చేయను. రాజకీయ అనుభవం ఉన్నవాళ్లు ఎవరూ మోదీని విమర్శించడం లేదు. మోదీ వయసు గురించి మాట్లాడే దమ్ము వైసీపీ వాళ్లకు ఉందా? ఏపీ, తమిళనాడులో కాంగ్రెస్ పుంజుకునే అవకాశం లేదు. దక్షిణాదిలో తెలంగాణ, కర్నాటకలోనే కాంగ్రెస్ ఉంది' అని చంద్రబాబు వివరించారు. 'తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలపై తమ పార్టీ దృష్టి సారించింది. అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు ఓ కమిటీని నియమించాం. తెలంగాణలో అన్ని స్థానాల్లో పోటీ చేస్తాం. ఇప్పటికే పోటీపై కమిటీ వేశాం' అని చెప్పారు. తెలంగాణలో బీజేపీతో పొత్తు ఉంటుందా అన్న ప్రశ్నకు అందుకు సమయం మించిపోయిందని చంద్రబాబు సమాధానం ఇచ్చారు.

పెద్దనోట్ల రద్దుతో నోట్ల పంపిణీ ఉండదు

'రూ.500 కరెన్సీ నోట్లను కూడా రద్దు చేయాలని నేను కేంద్ర ప్రభుత్వానికి గతంలో సూచించాను. అలా చేసి ఉంటే ఎన్నికల్లో నగదు పంపిణీ ఉండదు. మంచి ప్రభుత్వాలు అధికారంలోకి వస్తాయి. భారతదేశం టెక్నాలజీలో చాలా ముందు వరుసలో ఉంది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలోకి వస్తోంది. వ్యవసాయం, ఆరోగ్య రంగాల్లో ఈ సాంకేతిక పరిజ్ఞానంతో విప్లవాత్మక మార్పులు చూడొచ్చు. భారత్‌లో అనంతమైన సౌర శక్తి ఉంది. సౌర, పవన విద్యుత్ సహా భారత్‌కి డెమోగ్రఫిక్ సానుకూలత చాలా ఎక్కువ. భారత్‌కి యువ శక్తి అధికం. దేశం అభివృద్ధి చెందిన తర్వాత ప్రజలు పిల్లలు వద్దని అనుకుం టారు. అప్పుడు యువ శక్తి తగ్గుతుంది. అందుకే భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని జనాభా పెరగాలని కోరుకుం టున్నా. పిల్లల్ని కనాలని ప్రోత్సహిస్తున్నాం. ప్రతి కుటుంబాన్ని పర్యవేక్షించేలా సాంకేతికతను వినియోగించుకోవాలి. ప్రతి పేద కుటుంబాన్ని పేదరికం నుంచి బయటపడేలా చూడొచ్చు. అదానీ, అంబానీ, టాటా అంటూ కొందరికే ఆస్తులు సృష్టించడం కంటే ప్రతి కుటుంబానికి ఆస్తి సృష్టించే అవకాశం కల్పించాలి. ఇక్కడ కూర్చుని గ్లోబల్ అవసరాలు తీర్చే ఉద్యోగం చేయవచ్చు. ఇండియన్ అనేవాడు భూమి మీద ఎక్కడైనా పనిచేయ గలడు. జపనీయులు గుంపుగా తప్ప విడిగా బయటకు రారు. భారతీయులు ఏ వాతావరణం అయినా తట్టుకుంటారు. ఇండియాది బెస్ట్ కల్చర్' అని చంద్రబాబు తెలిపారు.

అభివృద్ధి, ఆవిష్కరణలకు యువతే మార్గదర్శకం

ఏఎన్‌యూ స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్

విశాలాంధ్ర-మంగళగిరి: శాస్త్ర, సాంకేతిక, పరిశోధనా రంగాల్లో యువతరం అపార కృషి చేస్తోందని, అభివృద్ధి, వినూత్న ఆలోచనలు, ఆవిష్కరణలకు యువతే మార్గదర్శకమని గవర్నర్, విశ్వవిద్యాలయ కులపతి జస్టిస్ అబ్దుల్ నజీర్ అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 39వ, 40వ వార్షిక స్నాతకోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గవర్నర్ ఇచ్చిన ప్రసంగం విద్యార్థులకు భావిసూచకంగా నిలిచింది. ప్రపంచ దేశాల అనుసంధానం జరుగుతున్న నేటి విప్లవాత్మక పరిణామ క్రమంలో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో యువతదే ప్రధాన పాత్ర అని తెలిపారు. యువత భవిష్యత్తు నిర్మాతలు అని, ప్రస్తుతం శాస్త్ర, సాంకేతిక పరిశోధనలే జ్ఞానానికి మూల స్తంభాలుగా ప్రపంచ గతిని మారుస్తున్నాయని వివరించారు. భారతదేశం ఉన్నత విద్యకు ఎంతో ప్రాధాన్యత నిస్తుందన్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో సాధించిన ఫలితాలు ప్రపంచ సవాళ్లను అధిగమించి పర్యావరణ సుస్థిరతను, నైతికతను, మానవతకు బలాన్ని చేకూరుస్తాయని సూచించారు. ఆధునిక ప్రపంచానికి అత్యాధునిక వరం కృత్రిమ మేధ అని, విద్యార్థులు సాధించే సాంకేతిక ఫలితాలు సమాజంలోని అన్ని రంగాలను వృద్ధిలోకి తీసుకురావాలని అన్నారు. జ్ఞాన సముపార్జన వ్యక్తిగత సాధనగా భావించరాదని, ప్రపంచ మానవాళిని వృద్ధిలోకి తెచ్చే ఉన్నతాశయ సాధనామార్గం అని తెలిపారు. వ్యవస్థాపకత అనే ఆలోచన దేశంలోని నిరుద్యోగ సమస్యను నివారించే గొప్ప ప్రయత్నమని విద్యార్థులకు సూచించారు. ఆత్మనిర్భర భారత్, స్టార్టప్ ఇండియా అనే భారత నినాదాలు యువతకు గొప్ప కాంతి కిరణాలని అభివర్ణించారు. భారతదేశం ప్రపంచంలోనే అత్యధిక స్టార్టప్ కేంద్రాలతో విలసిల్లుతోందని తెలిపారు.

ప్రతి ప్రయోగం ఒక సవాలుగా తీసుకోవాలని అందుకు ఉదాహరణే చంద్రయాన్-3 అని యువతకు దిశానిర్దేశం చేశారు. యువత సాధించే వినూత్న ఆలోచనలు, ఆవిష్కరణలు, సహకారం కోసం ప్రపంచమంతా ఎదురుచూస్తోందని, యువ మేధావులంతా వారి భవిష్యత్తు మార్గం ప్రకాశవంతం చేసుకోవాలని కోరుకుంటున్నానని అన్నారు. ప్రఖ్యాత సంపాదకులు, రామన్ మెగసెసే అవార్డు గ్రహీత, నేటి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ గౌరవ డాక్టరేట్ గ్రహీత పాలగుమ్మి సాయినాథ్ మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ గొప్ప భాషా వారసత్వ చరిత్ర కలిగినదని వివరించారు. సభాధ్యక్షులుగా వ్యవహరించిన ఏఎన్‌యూ ఉపకులపతి ఆచార్య పి.రాజశేఖర్ విశ్వవిద్యాలయ ఉన్నత విద్యా ప్రగతిని వివరించారు. ఈ కార్యక్రమంలో 30 మందికి పైగా విశేష ప్రతిభ కనబరిచిన పరిశోధక విద్యార్థులకు బంగారు పతకాలు గవర్నర్ చేతుల మీదుగా అందించారు. నేటి స్నాతకోత్సవంలో 260 పీహెచ్‌డీ పట్టాలు, 235 బంగారు పతకాలు, 18 మంది విద్యార్థులకు నగదు పురస్కారాలను విశ్వవిద్యాలయం అందజేసింది. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, విశ్వవిద్యాలయ ప్రాచార్యులు, డీన్‌లు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

జగన్‌తో నావికాదళ ప్రధానాధికారి భేటీ

ఫిబ్రవరిలో విశాఖలో మిలన్ 2024 నిర్వహణపై చర్చ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని మంగళ వారం తూర్పు నావికా దళం ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్, వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల ఈఎన్‌సీ చీఫ్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఆయనను దుశ్శాలువాతో సత్కరించి శ్రీ వేంకటేశ్వర స్వామి ప్రతిమను అందజేశారు. అలాగే, ఐఎన్ఎస్ విశాఖపట్నం షిప్ మోడల్‌ను ఆయన సీఎంకు బహుకరించారు. తూర్పు సముద్ర తీరంలో సముద్ర భద్రతకు సంబంధించి తలెత్తుతున్న సవాళ్లను అధిగమించేందుకు భారత నావికాదళం చేపట్టిన వివిధ కార్యక్రమాలను ముఖ్యమంత్రికి వివరించారు. తూర్పు నౌకాదళ కమాండ్ (ఈఎన్‌సీ) అధ్వర్యంలో వచ్చే ఫిబ్రవరిలో బహుపాక్షిక నావికా విన్యాసమైన మిలన్ 2024కు విశాఖపట్నం నగరం ఆతిథ్యం ఇవ్వనున్న నేపథ్యంలో దానికి సంబంధించిన అంశాలను సీఎం దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమానికి 57 దేశాల నుంచి ప్రముఖులు, నౌకాదళాల భాగస్వామ్యం ఉంటుందని అంచనా వేస్తున్నట్లు పెంధార్కర్ వెల్లడించారు. నావికాదళ ఉన్నతాధికారులు కెప్టెన్ వి.ఎస్.సి.రావు (సివిల్ మిలటరీ లైజన్ (అడ్వైజరీ), కెప్టెన్ రోహిత్ కట్టోజు, కమాండర్ వై.కె.కిషోర్, లెఫ్టినెంట్ సాయికృష్ణ తదితరులు సీఎంను కలిసిన వారిలో ఉన్నారు.

నేడు సీఎం కాకినాడ జిల్లాలో పర్యటన

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేడు కాకినాడ జిల్లా జగ్గంపేటలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి జగ్గంపేట మండలం ఇర్రిపాక చేరుకుంటారు. అక్కడ జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటీబాబు నివాసంలో ఆయన కుమార్తె వివాహ వేడుకకు సీఎం హాజరవుతారు. అనంతరం మధ్యాహ్నం తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

గ్రూప్-1, 2 ఉద్యోగాల వయోపరిమితి పెంచాలి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీపీఎస్సీ నుంచి త్వరలో ప్రకటించనున్న గ్రూప్ 1, 2 ఉద్యోగాలలో జనరల్ అభ్యర్థుల వయోపరిమితిని 47 సంవత్సరాలకు పెంచాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సమయం హేమంత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎట్టకేలకు చాలా వినతులు తర్వాత గ్రూప్-1 లో 89 పోస్టులకు, గ్రూప్-2లో 508 పోస్టులకు ఆర్థిక శాఖ అనుమతిచ్చిందన్నారు. వెంటనే ఏపీపీఎస్సీ ద్వారా ఈ పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగాల ప్రకటనలం సక్రమంగా లేనందున ఏపీపీఎస్సీతోపాటు డీఎస్సీ ఉద్యోగాల వయోపరిమితి 47 సంవత్సరాలకు(జనరల్ అభ్యర్థులకు) పెంచాలన్నారు. డిజిటల్ గ్రంథాలయాలు, పోలీస్ , ఫైర్, జై వార్డెన్లు , మిగిలిన సచివాలయ ఖాళీలకు ప్రకటనలు తక్షణమే పూర్తిస్థాయిలో విడుదల చేసి నిరుద్యోగుల్ని ఆదుకోవాలని హేమంత్ కోరారు.

వైసీపీలోకి టీడీపీ నేతలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అనకాపల్లి, విజయనగరం జిల్లాలకు చెందిన టీడీపీ నేతలు వైసీపీలో చేరారు. అనకాపల్లి జిల్లాకు చెందిన టీడీపీ నేత మలశాల భరత్ కుమార్, తల్లిదండ్రులు రమణారావు (విశాఖ డెయిరీ డైరెక్టర్), ధనమ్మ (మాజీ ఎంపీపీ) వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. క్యాంపు కార్యాలయంలో వారికి సీఎం పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా భరత్‌కుమార్‌తో పాటు గంగుపాం నాగేశ్వరరావు (మాజీ డీసీఎంఎస్ చైర్మన్), మలశాల కుమార్ రాజా (విశాఖ జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి) వైసీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉత్తరాంధ్ర జిల్లాల వైసీపీ ప్రాంతీయ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, అనకాపల్లి జిల్లా వైసీపీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ పాల్గొన్నారు.

టీడీపీ మాజీ ఎమ్మెల్యే తేలే భద్రయ్య చేరిక

విజయనగరం జిల్లా రాజాంకు చెందిన టీడీపీ మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, ఆయన తనయుడు డాక్టర్ తలే రాజేష్ వైసీపీలో చేరారు. పాలకొండ నియోజకవర్గం నుంచి టీడీపీలో రెండు సార్లు తలే భద్రయ్య (1985, 1994) గెలుపొందారు. ఏపీపీఎస్సీ సభ్యుడిగా ఆరేళ్ల పాటు ఆయన పని చేశారు. ఈ కార్యక్రమంలో వైవీ సుబ్బారెడ్డితో పాటు విజయనగరం జిల్లా వైసీపీ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను), రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ ప్రణాళిక ఏది?

రైతును ఆదుకోవాలి కేవీవీ ప్రసాద్ డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలో 400 మండలాలలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నా యని, దీనిని ఎదుర్కోవడానికి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం 86 లక్షల ఎకరాలు కాగా ఇప్పటి వరకు 48 లక్షల ఎకరాలలో మాత్రమే రైతులు పంట వేశారని తెలిపారు. గతేడాది కన్నా 16 లక్షల ఎకరాల సాగు తగ్గినట్లు ప్రభుత్వ గణాంకాలు చెబు తున్నాయని పేర్కొన్నారు. అన్నమయ్య, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, వైఎస్సాఆర్ కడప జిల్లా, అంబేద్కర్ కోనసీమ, శ్రీసత్యసాయి, పశ్చిమ గోదావరి, పల్నాడు, తిరుపతి, ప్రకాశం, అనంత పురం, కాకినాడ, నంద్యాల, కర్నూలు, ఎన్టీఆర్ జిల్లాల్లో 20 నుండి 50 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని వివరించారు. వర్షాభావ పరిస్థితి వల్ల చాలా జిల్లాల్లో రెండు, మూడుసార్లు విత్తనం వేయాల్సి వచ్చిందని, ప్రస్తుతం ఉన్న పంటలు ఎండిపోతున్నాయని, అయినా ప్రత్యామ్నాయ ప్రణాళిక సిద్ధం చేయడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైందని కేవీవీ ప్రసాద్ విమర్శిం చారు. విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా ఉండటంతో వ్యవసాయ బోర్ల ద్వారా వేసిన పంటలను కాపాడుకోవడం రైతాంగానికి కష్టతరంగా మారిందని తెలిపారు. అనేక చోట్ల ట్యాంకర్ల ద్వారా సుదూర ప్రాంతాల నుండి నీటిని తెచ్చుకొని పంటలు కాపాడుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. నారుమడులు సైతం ఎండి పోతున్నా యని, దీంతో వరిసాగు ప్రమాదంలో పడిందని తెలిపారు. ప్రధాన ప్రాజెక్టులు తుంగభద్ర, శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల, వెలిగోడు, సోమశిల, కండలేరులలో నీటిమట్టం ప్రమాదకరస్థాయికి చేరే స్థితి ఏర్పడింది. ప్రకాశం జిల్లాలో కేవలం 12 శాతం మాత్రమే పంటలు సాగయ్యాయి. అనకాపల్లి జిల్లాలో 24 శాతం, బాపట్ల జిల్లాలో 25 శాతం, కడప, అన్నమయ్య జిల్లాల్లో 27 శాతం పంటలు వేశారు. అనంతపురం, అన్నమయ్య, కర్నూలు జిల్లాలలో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఎండ పోతున్న పంటలను పరిశీలించిందని కేవీవీ ప్రసాద్ వివరించారు. రైతాంగాన్ని ఆదుకు నేందుకు సత్వర చర్యలు చేపట్టాలని, కరువువాత మండలాలను కరువు మండలాలుగా గుర్తించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన తప్పదని హెచ్చ రించారు. ప్రత్యామ్నాయ పంటలు వేసుకునేం దుకు అవసరమైన సాంకేతిక సలహాలు, సూచనలు రైతాంగానికి అందించి, అవసరమైన విత్తనాలు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రైతాంగం తీసుకున్న పంట రుణాలు రద్దు చేసి...తాజాగా రుణ సౌకర్యం కల్పించాలని, పశు గ్రాసం సరఫరా చేయాలని, నష్టపోయిన పంటలకు పంటల బీమా, నష్టపరిహాం ఇవ్వాలని డిమాండు చేశారు.

ఆయుధాల తయారీ, ఎగుమతుల్లో భారత్ పురోగతి

విశాలాంధ్ర-విశాఖ సిటీ: పటిష్టమైన భద్రత వ్యవస్థను కలిగి ఉన్నపుడే దేశ ఆర్థిక పురోగతి సాధ్యపడుతుందని సెంట్రల్ కమాండ్ కమాండింగ్ ఇన్ చీఫ్ జనరల్ ఆఫీసర్ ఎన్ఎస్.రాజుసుబ్రమణి అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన 'అమృత్ విజన్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ' అనే అంశంపై విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ఆయుధ తయారీ, ఎగుమతులు చేసే దిశగా భారత్ పురోగతి సాధిస్తోందన్నారు. అంతరిక్ష రంగంలో భారత్ సాధిస్తున్న ప్రగతి దేశానికే గర్వకారణమన్నారు. భారత త్రివిధ దళాలు సాంకేతికతను అందిపుచ్చు కుంటూ అత్యంత బలమైన రక్షణ వ్యవస్థగా రూపుదిద్దుకుంటున్నాయన్నారు. దేశ రక్షణ రంగం దేశీయంగా తయారీకి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని... 2047 నాటికి 2.5 లక్షల కోట్ల ఎగుమతులు లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. అత్యంత ప్రాముఖ్యత కలిగి 10 టెక్నాలజీలలో దేశ రక్షణ రంగాలు సామర్థ్యాలను పెంపొందించుకుం టున్నాయని సుబ్రమణి చెప్పారు. భారత దేశం మేజర్ పవర్‌గా రూపాంతరం చెందాలనే ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏయూ ఉపకులపతి ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డి, రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ పాల్గొన్నారు.

వాడుక భాషోద్యమంతోనే వికాసం

కొమ్మినేని శ్రీనివాసరావు

విశాలాంధ్ర- విజయవాడ: గిడుగు రామ్మూర్తి పంతు లు వాడుక భాషోద్యమం ఆంధ్ర సారస్వత వికాసానికి, విద్యా బోధనకు ఎంతగానో సహకరించిందని సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. గిడుగు జయంతి సందర్భంగా స్థానిక సీఆర్ మీడియా అకాడమీ కార్యాలయంలో 'మీడియాలో వాడుక భాష'పై మంగళవారం జరిగిన సదస్సుకు ఆయన అధ్యక్షత వహించారు. కొమ్మినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ వాడుక భాషలో బోధన తమ లాంటి ఎంతోమందికి ఉపయోగపడిందని, ఉన్నత స్థానాలకు చేరుకునే అవకాశం కల్పించిందన్నారు. వాడుక భాష పత్రికల వ్యాప్తికి, సమ కాలీన అంశాలపై సమాచారం ప్రజలకు చేరవేయ డానికి దోహదపడిందన్నారు. మాతృభాషను ప్రోత్సహిస్తూనే పాఠశాల విద్య నుంచి ఆంగ్ల భాషను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి ప్రవేశపెట్టారన్నారు. ప్రపంచ భాషగా కొనసాగుతున్న ఆంగ్లభాష నేర్చుకోవడం ద్వారా ఉపాధి, ఉద్యోగాలలో మన పిల్లలు పోటీ పడే అవకాశాన్ని ముఖ్య మంత్రి కల్పిస్తున్నారన్నారు. దీనిపై అనేకమంది చేస్తున్న వివాదాస్పద వ్యాఖ్యలను వారి విజ్ఞతకే వదిలి... ముందుకు పోవాలని ఆయన పిలుపునిచ్చారు. వాడుక భాష రూపంలో సరళమైన భావం ప్రజలకు అందించ డంలో పత్రికలు కృషి చేయాలన్నారు. నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ అధ్యక్షుడు మేడపాటి వెంకట్, ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీవీఆర్ కృష్ణంరాజు, సీనియర్ జర్నలిస్ట్ భండారు రాధాకృష్ణ, మీడియా అకాడమీ మాజీ సభ్యులు నిమ్మరాజు చలపతిరావు, ప్రముఖ సినీ, టీవీ దర్శకులు హృదయరాజ్, శ్రీశ్రీ అంతర్జాతీయ సంస్థ అధ్యక్షుడు కత్తిమండ ప్రతాప్‌కుమార్, మీడియా అకాడమీ కార్యదర్శి మామిడిపల్లి బాలగంగాధర్ తిలక్, సీనియర్ జర్నలిస్ట్ తాళ్లూరి వెంకట సుబ్బయ్య ప్రసంగించారు. భాషా కోవిదులు డాక్టర్ టేకుమళ్ల వెంకటప్పయ్య, టీవీ సుబ్బయ్య, అనంత హృదయరాజ్, కత్తిమండ ప్రతాప్‌కుమార్, అద్దంకి రాజాయోనాలను కొమ్మినేని శ్రీనివాసరావు సన్మానించారు.

'ఆదిత్య'కు చకచక ఏర్పాట్లు

భానుడి పరిశోధనకు ఇస్రో మిషన్

విశాలాంధ్ర-సూళ్లూరుపేట: చంద్రయాన్-3 ప్రయోగాన్ని విజయవంతంగా చేపట్టి చంద్రుని దక్షిణ ధ్రువంపై అధ్యయనాన్ని ప్రారంభించిన ఇస్రో ప్రస్తుతం మరో ప్రతిష్ఠాత్మక ప్రయోగానికి సిద్ధమైంది. తొలిసారిగా సూర్యుడిపై పరిశోధనలు చేసేందుకు శ్రీకారం చుట్టింది. సెప్టెంబరు 2న ఆదిత్య ఎల్1 ప్రయోగాన్ని చేపట్టనున్నట్లు ఇస్రో ప్రకటించింది. జాబిలమ్మ రహస్యాలను ఛేదించే దిశగా చేపట్టిన చంద్రయాన్-3 ప్రయోగంలో భాగంగా చంద్రుని దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టిన విక్రమ్ ల్యాండర్ నుంచి ప్రజ్ఞాన్ రోవర్ బయటకు వచ్చి తన అధ్యయనాన్ని ప్రారంభించింది. ఈ క్రమంలో సూర్యుడిపై అన్వేషణకు సిద్ధమైన ఇస్రో ఆదిత్య ఎల్1 ఉపగ్రహాన్ని ప్రయోగించేందుకు సన్నద్ధమైంది. సెప్టెంబరు 2న పీఎస్ఎల్వీ-సీ57 ద్వారా ఈ ప్రయోగాన్ని చేపట్టనున్నట్లు వెల్లడించింది. రెండవ తేదీ ఉదయం 11.50 నిమిషాలకు శ్రీహరికోటలోని మొదటి ప్రయోగ వేదిక నుంచి నింగిలోకి పంపనున్నట్లు ఇస్రో శాస్త్రవేత్తలు వెల్లడించారు. ఇప్పటికే ఆదిత్య ఎల్1 ఉపగ్రహాన్ని శ్రీహరికోట చేరవేశారు. వ్యాబ్‌లో వాహన నౌక నాలుగు దశల అనుసంధానం పూర్తి చేశారు. సోమవారం అనుసంధాన భవనం నుంచి ప్రయోగ వేదికకు తరలించారు. సూర్యుడిపై ఉన్న వాతావరణ అధ్యయనమే లక్ష్యంగా ఇస్రో ఈ ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. కొరోనాగ్రఫీ పరికరం సాయంతో సూర్యుడిపై ఈ పరిశోధనలు చేయనున్నట్లు స్పష్టం చేశారు. యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ, ఆస్ట్రేలియా, ఇతర దేశాల అంతరిక్ష సంస్థల సాయంతో ఇస్రో ఈ ప్రయోగం చేయను న్నది. 1500 కిలోల బరువు కలిగిన ఆదిత్య ఎల్1 ఉపగ్రహాన్ని భూమి నుంచి సూర్యుని దిశగా 15 లక్షల కిలోమీటర్ల దూరంలో ఉన్న లాంగ్రాజ్ పాయింట్ 1(ఎల్ 1) చుట్టూ ఉన్న కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్నారు. నిత్యం సూర్యుడిపై అధ్యయనం చేసేందుకు ఈ కక్ష్యలోకి ఉపగ్రహాన్ని పంపిస్తు న్నారు. మొత్తం ఏడు పేలోడ్లను నింగిలోకి మోసుకెళ్లనుంది. విజిబుల్ ఎమిషన్ లైన్ కొరోనాగ్రాఫ్‌తో పాటు సోలార్ అల్ట్రావైలెట్ ఇమేజింగ్ టెలిస్కోప్, ఆదిత్య సోలార్ విండ్ పార్టికల్ ఎక్స్పెరిమెంట్, ప్లాస్మా అనలైజర్ ప్యాకేజ్ ఫర్ ఆదిత్య, సోలార్ ఎనర్జీ ఎక్స్ స్పెక్ట్రోమీటర్, హైఎనర్జీ ఎల్-1 ఆర్బిటింగ్ ఎక్స్ స్పెక్ట్రోమీటర్, మ్యాగ్నెటోమీటర్ పేలోడ్లను ఆదిత్య ఎల్ 1 మోసుకెళ్లనుంది. సూర్యుడి నుంచి వెలువడే అత్యంత శక్తివంతమైన కాంతి ప్రభావాన్ని అధ్యయనం చేసేందుకు ఈ పేలోడ్లను రూపొందించారు.

కేఏ పాల్ దీక్ష భగ్నం

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కేఏ పాల్ సోమవారం నుంచి ఫంక్షన్ హాల్‌లో నిరవధిక నిరాహార దీక్షకు దిగిన నేపథ్యంలో మంగళవారం సాయంత్రం ఆయన చేస్తున్న దీక్షను పోలీసులు భగ్నం చేసి కేజీహెచ్ ఆసుపత్రికి తరలించారు. కేజేహెచ్ ఆస్పత్రిలో కాసేపు పోలీసుల్ని కేఏ పాల్ పరుగులు పెట్టించారు. తాను మళ్ళీ వెళ్లి దీక్షా శిబిరం వద్ద కూర్చుంటానని వాళ్లతో వాదనకు దిగారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నదని, విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం 25 మంది ఎంపీలు ఉన్న వైసీపీ కూడా తనలా పోరాటం చేయడం లేదని కేఏ పాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతియుతంగా తాను చేస్తున్న దీక్షను భగ్నం చేసేందుకు పోలీసుల ద్వారా వైసీపీ ప్రభుత్వం పూనుకుంటున్నదని మండి పడ్డారు. విశాఖ ఉక్కు పరిరక్షణ క్రెడిట్ తనకు రాకూడదనే ఇలా చేస్తున్నారని ఆరోపించారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ప్రాణ త్యాగానికైనా సిద్ధమన్నారు. రాష్ట్రం అప్పుల భారం తీర్చే సత్తా స్టీల్ ప్లాంట్‌కి మాత్రమే వుందన్నారు. ప్లాంట్ నిర్వహిస్తే ఏటా లక్ష కోట్ల ఆదాయం వస్తుందన్నారు. ప్లాంట్‌లో 33 వేల ఎకరాలు భూములు వున్నాయని, తాను ఎంపీగా గెలిస్తే, గంగవరం పోర్టు సీజ్ చేస్తానని హెచ్చరించారు. తెలుగు ప్రజల సత్తా చూపిస్తాం... గుజరాత్‌కు గుణపాఠం నేర్పుతాం అని కేఏల్ పాల్ నినాదించారు.

విద్యుత్ కోతలు ప్రజలకు... జే-టాక్స్ జగన్‌కా!

విద్యుత్ శాఖ మాజీ మంత్రి కళా వెంకట్రావు

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలో అప్రకటిత విద్యుత్ కోతలతో ఓవైపు ప్రజలు, మరోవైపు రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతుంటే, ముఖ్యమంత్రి, మంత్రులు జే-టాక్స్ వసూళ్లలో మునిగితేలుతున్నారని విద్యుత్ శాఖ మాజీ మంత్రి కిమిడి కళావెంకట్రావు మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని విమర్శించారు. అడ్డగోలుగా విద్యుత్ చార్జీలు పెంచడమే కాకుండా అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తూ వినియోగదారులకు పగలే చుక్కలు చూపిస్తున్నారని ఆరోపించారు. వర్షాకాలంలో కూడా విద్యుత్ కోతలు పెట్టిన మొదటి ముఖ్యమంత్రిగా జగన్ మిగిలిపోతారని తెలిపారు. రాష్ట్రంలో కొన్ని చోట్ల 15 నుంచి 18 గంటల వరకు విద్యుత్ కోతలు విధిస్తున్నారని, దీంతో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వినియోగదారులు ఎప్పుడు సబ్‌స్టేషన్లు ముట్టడిస్తారోనని విద్యుత్ ఉద్యోగులు భయపడుతున్నారని, కొన్ని చోట్లయితే ఉద్యోగులు సబ్‌స్టేషన్లు వదిలి పారిపోతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యుత్ వినియోగదారులపై నాలుగేళ్లలో రూ.57 వేల కోట్ల భారాలు వేసి విద్యుత్ కోతలు పెడతారా అని నిలదీశారు. రాయలసీమలో ఓ వైపు వర్షాభావ పరిస్థితులతో రైతులు సాగునీటికి కటకటలాడుతుంటే మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు మరోవైపు అప్రకటిత విద్యుత్ కోతలతో అన్నదాతల ఆశలపై నీళ్లు చల్లుతున్నారని తెలిపారు. విద్యుత్ ఎప్పుడొస్తుందో తెలియక రాత్రింబవళ్లు అన్నదాతలకు పంటపొలాల వద్ద కాపలా కాయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. రాష్ట్రంలో అనేక చోట్ల లో-ఓల్టేజీ సమస్య తీవ్రంగా ఉందని అన్నారు. తెలుగు ప్రజలు మరిచిపోయిన లో-ఓల్టేజీ సమస్యను వైసీపీ ప్రభుత్వం మరలా పరిచయం చేస్తుందని పేర్కొన్నారు. అభివృద్ధి అంటే నిన్నటి కంటే నేడు బాగుండడం అని పాదయాత్రలో ఊదరగొట్టిన జగన్ నిన్న లేని విద్యుత్ కోతలు నేడు పెట్టడమేనా అభివృద్ధి అని ఎద్దేవా చేశారు. జగన్ చేతగానితనంతో రాయలసీమ రైతులు వలసబాట పట్టే పరిస్థితులు దాపురించాయన్నారు. ఇకనైనా ప్రభుత్వ యంత్రాంగం యుద్ధప్రాతిపదికన స్పందించి విద్యుత్ కోతలకు చెక్ పెట్టాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రజల తిరుగుబాటును ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు.

న్యూహారిజోన్ హాస్టల్‌లో అధికారుల తనిఖీ

ప్రాథమిక లోపాలున్నాయని వెల్లడి
విశాలాంధ్ర కథనానికి స్పందన

విశాలాంధ్ర ఎఫెక్ట్

విశాలాంధ్ర-కృత్తివెన్ను: తీరప్రాంతంలో నిర్వహిస్తున్న న్యూ హరిజోన్ పునరావాస కేంద్ర నిర్వహణలో ప్రాథమికంగా కొన్ని లోపాలను గుర్తించినట్లు రాష్ట్ర బాలల సంక్షేమ కమిషన్ (సీడబ్ల్యూసీ) సభ్యులు తెలిపారు. విశాలాంధ్రలో ఈ నెల 27 తేదీన 'ఆ హాస్టల్లో ఏం జరుగుతోంది ?' పేరుతో ప్రచురితమైన కథనానికి స్పందించిన కమిషన్ సభ్యులు మంగళవారం న్యూ హరిజోన్ హస్టల్‌లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సభ్యులు ప్రాతికేయులతో మాట్లాడుతూ... హాస్టల్ నిర్వహణలో ప్రాథమికంగా కొన్ని లోపాలను గుర్తించినట్లు తెలిపారు. జూనియర్ జస్టిస్ కేర్-2015 చట్టం ప్రకారం న్యూ హరిజోన్ పునరావాస కేంద్రానికి అనుమతులున్నాయన్నారు. అయితే ప్రస్తుతం అనుమతులు రెన్యూవల్ దశలో ఉన్నాయని వివరించారు. 18ఏళ్ల లోపు ఆడపిల్లలు ఈ పునరావాస కేంద్రంలో ఉంటారని వివరించారు. ఈ కేంద్రంలో ఉండే పిల్లలు ఎట్టి పరిస్థితుల్లోనూ బయటకు వెళ్లకూడదు. కానీ ఇక్కడి పిల్లలు ప్రతిరోజూ వాహనంలో వేరే ప్రాంతానికి వెళ్లి వస్తున్నారని వివరించారు. ఇక్కడి పిల్లలను బయటకు తీసుకువెళ్లి తీసుకురావటానికి ఎటువంటి అనుమతుల ఉన్నాయో పరిశీలిస్తున్నా మన్నారు. తల్లితండ్రులు లేక అనాథలుగా పెరిగి నేరప్రవృత్తికి అలవాటు పడినవారు, బల వంతంగా వ్యభిచార కూపంలోకి దింపబడినవారు, పోలీసుల రైడింగ్‌లలో దొరికినవారు, మాదక ద్రవ్యాలకు బానిసలైన వారితోపాటు ఇతర కేసులలో నిందితులుగా ఉన్నవారికి, మానసిక సంఘర్షణకు గురైన వారికి రాష్ట్ర చిల్డ్రన్స్ వెల్ఫేర్ కమిషన్ ద్వారా ఈ కేంద్రాలలో పునరావాసం కల్పిస్తామని వివరిం చారు. పరివర్తన కలిగిన వారిని తిరిగి తమతమ ప్రాంతాలకు పంపించివేయడం జరుగు తుందన్నారు. ఇటువంటి పునరావాస కేంద్రాలను గురించి స్థానిక అధికారులకు, పరిసరప్రాంత ప్రజలకు తెలియకుండా దాచవలసిన అవసరం లేదని కమిషన్ సభ్యులు స్పష్టం చేశారు. చిన్నపిల్లలకు సంబంధించి సామాజిక సమస్యలు గుర్తించిన వారు apscpcr2018@gmail.com కు పిర్యాదు చేయవచ్చునని తెలిపారు. న్యూ హరిజోన్ పునరావాస కేంద్రాన్ని పూర్తిస్థాయిలో పరిశీలించిన అనంతరం ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చిల్డ్రన్స్ వెల్ఫేర్ కమిషన్ సభ్యులు డా.టి రాజేంద్రప్రసాద్, బి.పద్మావతి, ఎల్.సీతారాం, కృష్ణా జిల్లా చైర్‌పర్సన్ కే సువార్త, డీపీఓ సత్యవతి, స్థానిక తహసీల్దార్ రామకోటేశ్వరావు, సీడీపీఓ సముద్రవేణి, మండల విద్యాధికారి ప్రసాద్, పునరావాస కేంద్రం వార్డెన్ ఎస్తేరు తదితరులు పాల్గొన్నారు.

GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION

'e' Procurement Tender Notice No:- 40/2023-24/SE-3/EE-VA/DB/dt: 28-08-2023

01. Number of works : 8 Nos; 02. Value of Works (ECV) : Rs.1113.22 Lakhs

Downloading Starting Date	:	28-08-2023 @ 11.00 PM
Downloading ending Date	:	05-09-2023 @ 02.00 PM
Last date of bid Submission	:	05-09-2023 @ 02.30 PM
Date of Opening of Tender	:	05-09-2023 @ 03.00 PM

Note : For any other details required in respect of above tender notice, please contact EE-VA before applying for tender schedules and visit: vsp@www.apeprocurement.gov.in

For Commissioner, GVMC

సంపాదకీయం

వ్యూహాలకన్నా విధానాలే ప్రధానం

ఈ నెల 31, సెప్టెంబర్ ఒకటిన ముంబైలో జరగనున్న సమైక్య ప్రతిపక్ష సంఘటన "ఇండియా" సమావేశం బీజేపీ గుండెల్లో గుబులు పుట్టిస్తోంది. మొదట ప్రతిపక్షాల సమైక్యతా యత్నాలను మోదీ కొట్టి పారేశారు. పైగా కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలు అవినీతి బురదలో, వంశపారంపర్య పాలనలో కూరుకుపోయాయని తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. ఇవన్నీ వాస్తవ దూరం. బీజేపీ అవినీతి, ఆనువంశిక పాలనకు అతీతం కాదు. అసత్య ప్రచారంలో ఆరితేరిన మోదీ చెప్పిన అబద్ధాన్నే చెప్తూ జనాన్ని మాయచేయడంలో అనితర సాధ్యమైన ప్రతిభ కనబరచగలరు. ఇవన్నీ మేకపోతు గాంభీర్యానికే చిహ్నం. ప్రతిపక్షాలు అనూహ్యంగా ఏకం కావడం, "ఇండియా" కూటమిలో చేరుతున్న పార్టీల సంఖ్య పెరుగుతుండడంతో మోదీకి ప్రశాంతత లేకుండా పోతోంది. బెంగళూరులో జులై 17, 18 తేదీల్లో ప్రతిపక్షాల రెండవ సమావేశం జరిగిన సమయంలోనే మోదీకి హఠాత్తుగా ఎన్.డి.ఎ. గుర్తుకొచ్చింది. హడావుడిగా ఎన్.డి.ఎ.ను పునరుద్ధరించే ప్రయత్నాలు మొదలు పెట్టారు. 2019 నుంచి మోదీ ఎన్నడూ ఎన్.డి.ఎ. ప్రస్తావనే తీసుకురాలేదు. పైగా ఎన్.డి.ఎ.లో భాగంగా ఉన్న శిరోమణి అకాలీ దళ్, బిజూ జనతాదళ్ లాంటివి ఎన్.డి.ఎ.కు దూరం అయినాయి. ఒరిస్సా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ నాయకత్వంలోని బిజూ జనతా దళ్ విధానాల రీత్యా బీజేపీకి భిన్నమైంది కాకపోయినప్పటికీ రాజకీయంగా బీజేపీతో మైత్రి కోరుకోవడం లేదు. ఎన్.డి.ఎ.ను పునరుద్ధరించడానికి మోదీ చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్న జాడలు ఎక్కడా లేవు. మరో వేపు పట్నాలో జరిగిన మొదటి ప్రతిపక్ష సమావేశంలో 16 పార్టీలే పాల్గొన్నాయి. కానీ ఇప్పుడు ఇండియా కూటమిలో ఉన్న పార్టీల సంఖ్య 26కు చేరింది. ఉత్తర ప్రదేశ్‌లో దళితుల మద్దతు గణనీయంగా ఉన్న మాయావతి నాయకత్వంలోని బి.ఎస్.పి. కూడా "ఇండియా" తో కలిసి నడిచే సూచనలున్నాయంటున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి కె.సి.ఆర్. నాయకత్వంలోని బి.ఆర్.ఎస్. ప్రస్తుతానికి ప్రతిపక్ష కూటమికి దూరంగానే ఉంది. ప్రతిపక్ష కూటమిలో చేరక పోవడానికి కె.సి.ఆర్.కు ప్రధానంగా రెండు సమస్యలున్నాయి. ఒకటి "ఇండియా" కూటమిలో ప్రధాన భాగస్వామి అయిన కాంగ్రెస్ క్రమంగా బలం పుంజుకునే సూచనలు కనిపిస్తున్నాయి. అంటే అధికారం నిలబెట్టుకోవడానికి కె.సి.ఆర్. కాంగ్రెస్ తో తలపడవలసిందే. మొన్నటి దాకా బీజేపీతోనే ప్రధానమైన పోటీ ఉంటుందని కె.సి.ఆర్. భావించినా ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. కానీ కె.సి.ఆర్. మోదీ సర్కారును దుయ్యబట్టడంలో వెనుకంజ వేయడం లేదు. ప్రాంతీయ పార్టీలను కలిపి బీజేపీని ఎదుర్కోవడానికి ఐక్య సంఘటనను ఏర్పాటు చేయడానికి కూడా కె.సి.ఆర్. కొంతకాలం ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో బీజేపీమీద విమర్శలు పెంచారు. డిసెంబర్ లో తెలంగాణ శాసనసభ ఎన్నికలు పూర్తి అయిన తరవాత కె.సి.ఆర్. సైతం ప్రతిపక్ష ఫ్రంటులో చేరే సూచనలున్నాయన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే గత తొమ్మిదేళ్ల కాలంలో కె.సి.ఆర్. పార్టీ వైఖరి పార్లమెంటులో బీజేపీకి అనుకూలంగానే ఉందన్న విషయాన్ని విస్మరించడానికి వీలులేదు. అకాలీదళ్, తెలుగు దేశం, శివసేన, జె.డి.(యు) ఒకప్పుడు ఎన్.డి.ఎ.లో భాగస్వామ్య పక్షాలే. అకాలీలు బీజేపీని సమర్థించే పరిస్థితి లేదు. తెలుగు దేశం బలహీనపడింది. శివసేనలో చీలిక వచ్చింది. అధికారంలో లేని ఉద్ధవ్ ఠాక్రే నాయకత్వంలోని శివసేన వర్గానికి ఇప్పటికీ జనం మద్దతు చెక్కు చెదరలేదు. అజిత్ పవార్ ఎన్.సి.పి. నుంచి విడిపోయి బీజేపీతో కలిసి ఉపముఖ్యమంత్రి అయినా శరద్ పవార్ ప్రభావాన్ని దెబ్బతీయగల సత్తా అజిత్ పవార్‌కు లేదు. అంటే చీలికలు శివసేన, ఎన్.సి.పి. మీద అంతగా ప్రభావం చూపే అవకాశం లేదు. జె.డి. (యు) ఇప్పుడు "ఇండియా"లో కీలక పాత్ర పోషిస్తోంది. బీజేపీయేతర పార్టీలు కొన్ని "ఇండియా" ఫ్రంట్ లో భాగస్వాములుగా ఉండడానికే మొగ్గు చూపుతున్నాయి. బీజేపీ కూటమిలో ఉన్న మిజో నేషనల్ ఫ్రంట్ ఇటీవలి అవిశ్వాస తీర్మానంపై ప్రతిపక్షాల సరసన నిలిచింది. శిరోమణి అకాలీ దళ్, బి.ఆర్.ఎస్. లాంటివి అంతిమగా "ఇండియా" వేపే మొగ్గొచ్చు. హర్యానాలోని ఇండియన్ నేషనల్ లోక్‌దళ్, మహారాష్ట్ర షెట్కారీ దళ్ కూడా ముంబై సదస్సుకు హాజరయ్యే సూచనలున్నాయి. మహారాష్ట్ర ఉభయ పక్షాలకూ కీలకమైందే. అందుకే "ఇండియా" రెండవ రోజు సమావేశం కొనసాగే రోజుననే ముంబైలో ఎన్.డి.ఎ. సమావేశం నిర్వహించాలని బీజేపీ నిర్ణయించడంలోనే అధికారపక్షం తత్తరపాటు ఎంత తీవ్రమైందో గమనించవచ్చు. ఈ నేపథ్యంలో గురువారం ముంబైలో ప్రారంభం అవుతున్న "ఇండియా" సమావేశంలో లక్ష్య సాధన సాధ్యం కావడానికి కొన్ని ప్రధానమైన అంశాల మీద శ్రద్ధ తీసుకోవలసి ఉంది. 2024 సార్వత్రిక ఎన్నికలలో మోదీని ఓడించాలంటే బహుముఖ పోటీలను నివారించి ముఖాముఖి పోటీ మీద దృష్టి కేంద్రీకరించడం అత్యవసరం. అయితే "ఇండియా" భాగస్వామ్య పక్షాలలో రాష్ట్రాల స్థాయిలో, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలలో అంతర్వైరుధ్యాలున్నాయి. "ఇండియా" ఫ్రంట్‌లోని భాగస్వామ్య పక్షాలే పరస్పరం తలపడక తప్పని స్థితిఉంది. ఇది జటిల సమస్యే. ఈ ఏడాది ఆఖరులోగా రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మిజోరం, తెలంగాణ ఎన్నికలలో విజయం ప్రతిపక్షాలకు ఉత్సాహం నింపే మాట నిజమే అయినా ప్రధానమైన దృష్టి 2024 లోకసభ ఎన్నికల మీదేనన్న స్పష్టమైన అవగాహన "ఇండియా" ఫ్రంటుకు ఉంది. అందుకే రాష్ట్రాల అంశానికి అంత ప్రాధాన్యం ఇవ్వడంలేదు. ఇవన్నీ వ్యూహాలకు సంబంధించిన అంశాలు. కానీ వ్యవస్థాపరంగానూ, ఆర్థిక వనరుల విషయంలోనీ బీజేపీకి ఎదురులేదు. ఎన్నికలలో విజయం సాధించడానికి మోదీ ఎన్ని ఎత్తులైనా వేయగలరు. ఎంతగానైనా దిగజారగలరు. ఈ లోపాలు కూడా "ఇండియా"కు అంతగా ఉపకరించకపోవచ్చు. అందుకే వ్యూహాలకన్నా విధానాలద్వారా మోదీని ఢీకొనే మార్గాలు అన్వేషించాలి. మోదీ కుటిల రాజకీయాల దుష్ప్రభావం మాత్రమే ప్రజల వైఖరిని నిర్దేశించదు. మోదీ సర్కారు మీద విశ్వాసం కోల్పోయిన ప్రజలు అమాంతం ప్రతిపక్షాల మద్దతుదార్లుగా మారిపోరు. జనం ఎదుర్కుంటున్న ఇబ్బందులకు మోదీ అనుసరిస్తున్న విధానాలే ప్రధాన కారణం. దీనికి ప్రత్యామ్నాయ మార్గాన్ని రూపొందిస్తే తప్ప ప్రతిపక్షఫ్రంట్‌పై ప్రజల విశ్వాసం కుదరదు. ధరల పెరుగుదల, నిరుద్యోగం ప్రస్తుతం అత్యధిక జనాభా ఎదుర్కుంటున్న ప్రధాన సమస్యలు. వీటిని దూరం చేయడానికి "ఇండియా" నిర్దిష్టమైన ప్రత్యామ్నాయ విధానాలను ప్రజల ముందుంచగలగాలి. ఏ పార్టీ ఎటువేపు ఉందన్న దానికన్నా ఏ పార్టీ లేదా ఏ కూటమి విధానాలు ప్రజానుకూలమైనవి అన్న అంశమే గెలుపు ఓటములకు ప్రధాన కారణం అవుతుంది. మోదీ దుష్ట విధానాలకు ప్రత్యామ్నాయదారి చూపడానికి ముంబై సదస్సులో ఎక్కువ శ్రద్ధ కనబరచాలి. అది ప్రజలకు వెలుగు దివిటీగా కనిపించాలి. ముంబై సమావేశంలో మోదీ ఆట కట్టించే విధానాలు "ఇండియా" రూపొందించినప్పుడే బలమైన తాత్విక పునాది ఏర్పడుతుంది. లోగో ఖరారు చేయడం, సమన్వయకర్తను ఎంపిక చేయడం మొదలైనవన్నీ అవసరమే కానీ, వాటికి ప్రథమ ప్రాధాన్యత లేదు. "ఇండియా" ఫ్రంట్ ఏ రూపంలో మోదీకి ప్రత్యామ్నాయం అవుతుందో రుజువు చేయగలిగితేనే మోదీని గద్దె దించడం సాధ్యం.

మేధో వలసల వరద

జనాభా విస్ఫోటన భారతంలో ఉన్నత విద్య అందని ద్రాక్ష అవుతున్నది. నాణ్యమైనవిద్య అది తక్కువ విద్యా సంస్థలకే పరిమితమైంది. ఉద్యోగ సాధన గగనమైపోతున్నది. విశ్వవిద్యాలయ సర్టిఫికేట్లకు గౌరవం అడుగంటుతున్నది. నైపుణ్యవిద్య అరుదైన సరుకైంది. ఏ దిక్కులేక డిగ్రీలు చదివిన భారతీయ యువత ఆకర్షణీయ వేతనాలు, ఆధునిక జీవనశైలి, జీవన/ఆరోగ్య భద్రత, అనుకూల వాతావరణం/ పాలసీలు, సులభ ఉద్యోగసాధన, పార్ట్‌టైమ్ ఉద్యోగాల సౌకర్యం లాంటి అనుకూల అంశాలతో విదేశాలకు ఎగిరి పోవాలని ప్రయాస పడుతున్నారు. ఏటేటా విదేశీవిద్య పేరున విమానాలు ఎక్కే యువత సంఖ్య పెరిగి పోతున్నది. విదేశీవిద్య కోసం లక్షల్లో మధ్య తరగతి దిగువ మధ్య తరగతియువత బ్యాంకు అప్పులభారాన్ని మోస్తూ విమానయానం చేస్తున్నారు. మన యువతకు ఆదర్శంగా భారతసంతతికి చెందిన గూగుల్ సిఈఓ సుందర్ పిచ్చయ్, మైక్రోసాఫ్ట్ సిఈఓ సత్యానాదెళ్ళ, ఐఎంఎఫ్ చీఫ్ ఎకానమిస్ట్ రఘురామ్ రాజన్ లాంటి మరెందరో నిలుస్తూ నిత్య ప్రేరణను ఇస్తున్నారు. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి, లక్షల ఖర్చుచేసి, తాము ఆశించిన యూనివర్సిటీలో కోరుకున్న కోర్సులో ప్రవేశాలుపొంది, వీసాలుపొంది విమానయానంచేసి అమెరికా ఎయిర్‌పోర్టులో కాలుమోపిన పిదప మన యువతీయువకులను అక్కడి ఇమ్మిగ్రేషన్ అధికారులు అనేక అనుమానాలతో దాదాపు 500మందిని వెనక్కి పంపించిన తాజాఘటనలు మనల్ని కలిచివేస్తున్నాయి. ఈ సంఘటనలతో మన యువతీయువకులు, వారి తల్లితండ్రులు తీవ్ర ఆందోళనలు చెందడం సహజం. వీసా అనేది ఏక్షణంలోనైనా రద్దు చేయవచ్చని, విద్యార్థులు సమర్పించే ధ్రువపత్రాలు సరైనవి కావని తేలినా, కొద్ది అనుమానాలకు తావిచ్చినా ఎప్పుడేనా చర్య తీసుకోవచ్చని అమెరికన్ కన్సులేట్ అధికారులు తెలపడం విచిత్రంగా, ఇబ్బందికరంగా ఉన్నది.

ఆధునిక కోర్సుల కోసం విదేశీ వలసలు:

2017 నుంచి గత ఏడాది వరకు 30.13 లక్షల భారత యువత విదేశాల్లో ఉన్నత విద్య కోసం వలసలు వెళ్లారని, 2020లో కరోనా విపత్తు కారణంగా 2.6 లక్షల యువత, 2021లో 4.45 లక్షలు, 2022లో 68 శాతం అధికంగా 7.5 లక్షల యువతీయువకులు విదేశీ చదువులకు పయనమయ్యారని తెలుస్తున్నది. విదేశీ విద్య నిమిత్తం మన యువత అమెరికా, యూకె, కెనడా, ఆస్ట్రేలియా, జర్మనీ, ఫ్రాన్స్ దేశాల వైపు ఎక్కువగా చూస్తున్నారు. విదేశీ విద్య కోసం వెళ్లిన మన యువత 2024 నాటికి ట్యూషన్/ప్రవేశ రుసుం/నెలసరి వ్యయం రూపంలో 75 బిలియన్ డాలర్లు (6 లక్షల కోట్ల రూపాయలు) వెచ్చించనున్నారని అంచనావేశారు. ఆర్‌బిఐ వివరాల ప్రకారం ప్రతి ఏట అమెరికాలో చదువుతున్న మన యువతకు ఒక్కొక్కరికి సగటున అన్ని ఖర్చులు కలుపుకొని 30,000 డాలర్ల ఖర్చు అవుతున్నట్లు తేలింది. మన యువతకు విదేశీ చదువులనిమిత్తం మన జాతీయ బ్యాంకులు కూడా సులభంగా అధిక మొత్తం రుణాలు మంజూరు చేయడంతో సామాన్య కుటుంబాలయువత కూడా సరిహద్దులు దాటడానికి ధైర్యంగా ప్రయత్నిస్తున్నారు. గత దశాబ్దంలో 4.61 లక్షల యువత జాతీయ బ్యాంకుల్లో రుణాలు తీసుకొని విదేశాలకు ఎగిరి పోతున్నారు. మన దేశీయ ఉన్నత విద్యా సంస్థలు ఎస్‌టిఈఎం (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథ్స్) సబ్జెక్టుల్లో నాణ్యమైన విద్య అందించని కారణంగా ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఐటీ లాంటి అత్యున్నత సంస్థల్లో కూడా కొన్ని కోర్సుల్లో సీట్లు (7,000 పిజీ సీట్లు, 3,000 పిహెచ్‌డి సీట్లు) ఖాళీగా ఉంటున్నాయి. ఇండియాలో పిహెచ్‌డి పూర్తి చేయడానికి సగటున కనీసం 5ఏండ్లు పడుతుండగా కెనడా/యూరోప్/ ఆస్ట్రేలియా లాంటి దేశాల్లో 3-4 ఏండ్లు మాత్రమే తీసుకొంటున్నారు.

యూకెలో భారత యువతకు చేదు అనుభవాలు:

విదేశీవిద్య వేటలో యూకెకు వెళ్లిన యువతకు విద్య అనంతరం ఉద్యోగాలు దొరకడం కష్టంగాఉంటున్నది. 2022లో ఉన్నత విద్య నిమిత్తం 22 శాతం యువత యూకె బాటపట్టారని, యూకె స్థానిక యువత కన్న భారతీయయువత వద్ద ఫీజులుఅధికంగా వసూలుచేస్తూ, అక్కడి యూనివర్సిటీలు ఆర్థికంగా బలపడుతున్నాయని తెలుస్తున్నది. యూకెలో చదివిన యువతలో 17శాతం వర్క్ వీసాలు, 5శాతం ఉన్నత చదువుల నిమిత్తం యూకెలో కొనసాగగా, 76 శాతం భారత యువతకు వీసాల గడువు తీరిపోతూ దిక్కులేని దుస్థితుల్లో వెనుదిరగవలసి వస్తున్నది. యూకెలో నాణ్యత కొరవడిన, డిమాండ్‌లేని కోర్సుల్లో చేరిన మనయువతకు భవిష్యత్తు నిరాశాజనకంగా ఉంటున్నది. యూకెలోని అత్యున్నత 24 యూనివర్సిటీల్లో మాత్రమే 13శాతం ప్రవాస భారత యువత ప్రవేశాలుపొంది మంచి భవితకు అర్హులు అవుతున్నారు. 2022 వివరాల ప్రకారం 2019-22 మధ్య కాలంలో విదేశీవిద్యవేటలో భారతీయ యువత 228దేశాలు/స్వతంత్ర ద్వీపాల(డిపెండెంట్ ఐలాండ్స్)కు వలసలు వెళుతున్నారు. పేద దేశాలైన అఫ్ఘానిస్థాన్, మొజాంబిక్, సోమాలియా, ఆఫ్రికాలాంటి దేశాల్లో ఉన్నతవిద్య నిమిత్తం కూడా యువత వెళుతున్నారు. ఇలాంటి దేశాల్లో ఉన్నత విద్యకు పోటీతక్కువగా ఉండడం, విద్య అనంతరం వ్యాపారాల్లో డబ్బు సంపాదించడం సులభంగా ఉన్నట్లు తెలుస్తున్నది. విదేశీ యూనివర్సిటీ ర్యాకింగ్, గుర్తింపు(ఎక్రెడిటేషన్), బోధనల పద్ధతులు, జీవనవ్యయం, ఉద్యోగసాధన లాంటి అంశాలను విశ్లేషించి విశ్వవిద్యాలయాలను ఎంపిక చేసుకుంటున్నారు. అంటే విలాసవంతమైన జీవితమని కలలుకనడం మానేసి, విదేశీ యూనివర్సిటీల ర్యాంకులను, నాణ్యతలను నిశితంగా పరిశీలించవలసి ఉంది.

డా॥బుర్ర మధుసూదన్‌రెడ్డి ,9949700037

ప్రపంచంపై వేలాడుతున్న అణుబాంబు

సి.ఆదికేశవన్

అమెరికా అణుబాంబుతో విధ్వంసమైన హిరోషిమాలోని ఒక ప్రాంతం

ప్రపంచంపై అణుయుద్ధంనీడ విస్తరిస్తున్నదని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ తాజగా కూడా హెచ్చరించారు. అభివృద్ధిచెందిన దేశాల వద్ద అణ్వాయుధాలు, బాంబుల నిల్వలు పెరుగుతూనే ఉన్నాయి. అభివృద్ధిచెందిన దేశాల మధ్య వైరుధ్యాలు, చీలికలు మూలంగా ఉద్రిక్తతలు రోజురోజుకూ ఎక్కువవుతున్నాయి. ఒక్కసారి మనం రెండో ప్రపంచయుద్ధం ముగిసే సమయంలో అమెరికా జపాన్ నగరాలైన హిరోషిమాపై 1945 ఆగస్టు 6వ తేదీన, 1945 ఆగస్టు 9న నాగసాకిలపై అణుబాంబులువేసి మానవాళిపట్ల అత్యంత క్రూరంగా వ్యవహరించిన ఘోరాన్ని గుర్తుచేసుకోవాలి. జపాన్ నగరాలు అనేకం మంటల్లో కాలిపోయాయి. ఎంతమంది మరణించారన్న సంఖ్య తెలియకపోయినప్పటికీ, మృతులు లక్షల్లోనే ఉంటారని భావించవచ్చు. ఈ మృతుల సంఖ్య లక్షా పదివేలని కొందరు, రెండులక్షల పదివేలని మరికొందరు అంచనావేశారు. రెండో ప్రపంచ యుద్ధం అనంతరం వివిధ రకాల వ్యాధులతో తల్లడిల్లిన ప్రజలు లక్షల్లోనే ఉన్నారు. ఇప్పటికీ కళ్లకు కాటరాక్టులు, శరీరంపై హానికరమైన గడ్డలు, థైరాయిడ్, రొమ్ము, ఊపిరితిత్తుల కేన్సర్ల మూలంగా అనేక లక్షలమంది బాధపడుతున్నారు. అణుబాంబులు వేసని తర్వాత జన్మించిన మూడుతరాల వారిపైనకూడా వాటి విపత్కర పరిణామాలు సంభవించాయి. అణ్వాయుధాలవల్ల మానవాళికి ఎంత ప్రమాదమనే అంశాన్ని హిరోషిమా, నాగసాకిలపై అమెరికా వేసినబాంబులు గుర్తుచేస్తున్నాయి. బాంబుల ప్రభావానికి గురైనవారు ప్రమాదకరమైన వ్యాధులతో తల్లడిల్లారు. అనేకరకాల వ్యాధులతో బాధలు పడుతున్నారు. దాదాపు 80ఏళ్ల క్రితం ఈ దుర్ఘటన ప్రపంచమానవాళికి తీవ్రమైన హెచ్చరిక.

సైనిక వ్యయం ప్రతిఏడాది పెరుగుతూనేఉంది. గత సంవత్సరం ఆయుధాల కొనుగోళ్ల విలువ రెండు ట్రిలియన్ డాలర్లకంటే ఎక్కువగాఉంది. ఇది ప్రపంచ జీడీపీలో 2.2శాతంగా అంచనావేశారు. అమెరికాలో 2022లో సైనిక వ్యయానికి 877 బిలియన్ డాలర్లు కేటాయించారు. ప్రపంచవ్యాప్తంగా కేటాయించిన నిధుల్లో అమెరికా ఒక్కటే 39శాతం కేటాయించింది. స్టాక్‌హోమ్ అంతర్జాతీయ శాంతి పరిశోధనా సంస్థ ప్రకారం, అమెరికా సైనిక కార్యకలాపాలకు, నిర్వహణకు 295 బిలియన్ డాలర్లు కేటాయించిందని తెలిపింది. ఇటీవల కాలంలో శాంతిగ్రూపులు, సైనికవ్యయాన్ని ఇకపై అమెరికా నిలిపివేయాలని తద్వారా ప్రపంచంపై వేలాడుతున్న అణుయుద్ధ ముప్పును నివారించాలని విజ్ఞప్తి చేస్తున్నాయి. చరిత్ర సృష్టించిన క్యూబా విప్లవనేత ఫిడెల్ కాస్ట్రో అణుయుద్ధ ముప్పును గురించి పదేపదే హెచ్చరించారు. అణుయుద్ధంకనుక సంభవిస్తే ప్రపంచ మానవాళికి అది తుది దినం అవుతుందని ఆయన అనేకమార్లు ప్రపంచ నాయకులను హెచ్చరించారు. అత్యంత ప్రమాదకరమైన ఆయుధాలను నిల్వచేయడం ఎంతమాత్రం సురక్షితంకాదని కాస్ట్రో అన్నారు. అణ్వాయుధాలు మానవాళి రక్షణకు ఉపయోగపడవని ఆయన చెప్పారు. నేడు ఉక్రెయిన్‌లో కమ్యూనిస్టులంతా మరణం ముప్పును ఎదుర్కొంటున్నారు. ఉక్రెయిన్‌లో కమ్యూనిస్టు యువనాయకులు అలెగ్జాండర్ కొనొ నొ విచ్, ఆయన సోదరుడు మైఖేల్ అరెస్టయి గృహనిర్బంధంలో ఉన్నారు. తమకు మరణముప్పు ఉందని ఇరువురు వెల్లడించారు. ఈ కార్యకర్తల అరెస్టులో ప్రపంచవ్యాప్తంగా అనేకమంది ఖండించారు. వీరి అరెస్టును, గృహ నిర్బంధాన్ని వివిధ కమ్యూనిస్టు, ప్రగతిశీల యూత్ గ్రూపులు ఖండిస్తూ ప్రకటనలు చేశాయి. పోలీసు అధికారులు పదేపదే తమ ఇంటికివచ్చి హత్యచేస్తామని బెదిరిస్తున్నారు. వీరి ఇంటి అడ్రసును ప్రకటించి వీరిని హత్యచేయాలని ప్రజలను కొరుతూ ఫేస్‌బుక్‌లో పోస్టు చేస్తున్నారు. ప్రపంచ ప్రజాస్వామ్య యువజన సమాఖ్య, గ్రీస్ కమ్యూనిస్టుపార్టీ, గ్రీసు కమ్యూనిస్టు యూత్ తక్షణం వారి ఇద్దరినీ గృహనిర్బంధం నుంచి విడుదల చేయాలని డిమాండ్ చేశాయి. ఏథెన్స్‌లోఉన్న ఉక్రెయిన్ రాయబార కార్యాలయం ముందు గ్రీసు కమ్యూనిస్టు పార్టీ, యువజన సమాఖ్య కార్యకర్తలు నిరసన ప్రదర్శన జరిపారు. ఉక్రెయిన్-రష్యా మధ్యజరుగుతున్న యుద్ధానికి అంతం పలకడానికి బదులుగా అమెరికా దాన్ని తైనాతి దేశాలు ఉక్రెయిన్‌కి ఆధునిక ఆయుధాలను సరఫరాచేసి యుద్ధం కొనసాగడానికి దోహదం చేస్తున్నాయి. ఈ విషయం తెలిసినప్పటికీ భారత్ అమెరికా వెంటనడుస్తూ హానికరవ్యూహాన్ని అనుసరిస్తున్నది. రష్యా, చైనా దేశాల మధ్య ఇటీవలికాలంలో ఏర్పడిన సఖ్యతను దెబ్బతీయాలని అమెరికా అనేకరకాల ప్రయత్నాలు చేస్తున్నది. భారత దేశంతో సహా ఆరు అభివృద్ధి చెందిన దేశాలు ఆయుధాల కొనుగోళ్లను మరింత పెంచుతున్నాయి. శాంతి పరిరక్షణకోరుతూ నిల్వపడిన అణ్వాయుధాలను ధ్వంసంచేయాలని అనేకమార్లు ఐక్యరాజ్యసమితి, శాంతిసంస్థలు చేసిన విజ్ఞప్తిని అమెరికా దాని అనుంగుదేశాలు పట్టించుకోవడంలేదు. అణ్వాయుధాలను నిరోధించాలని, ఉన్న ఆయుధాలను ధ్వంసం చేయాలని ప్రపంచదేశాల్లో ప్రజాఉద్యమాలు రావలసిన అవసరంనేడు ఎంతైనాఉంది.

స్పెయిన్ కల్లోల రాజకీయాల్లో కాంతిపుంజం

స్టీవెన్ ఫోర్టీ

రాజకీయ అస్థిరతలో కొట్టుమిట్టాడుతున్న స్పెయిన్‌లో జులై 23న సార్వత్రిక ఎన్నికల అనంతరం ఏర్పడిన నూతన కాంగ్రెస్ (పార్లమెంటు) అధ్యక్షపదవికి (స్పీకర్) సోషలిస్టు అభ్యర్థి ఫ్రాంసినా ఆర్మెంగోల్ ఎన్నిక కావటం వామపక్షానికి సానుకూల సంకేతం. 350మంది సభ్యులు కలిగిన కాంగ్రెస్‌లో రెండు ప్రధాన పార్టీల్లో దేనికీ కనీస మెజారిటీ లభించని స్థితిలో ప్రభుత్వ ఏర్పాటు నెలరోజులు గడిచినా ఒకకొలిక్కి రాలేదు. కాగా కాంగ్రెస్ అధ్యక్ష స్థానానికి పోటీలో సోషలిస్టుపార్టీ అభ్యర్థికి 178 ఓట్లు లభించటం, సోషలిస్టుపార్టీ నాయకత్వంలో మళ్లీ మైనారిటీ ప్రభుత్వం ఏర్పడే అవకాశాలను సూచిస్తున్నది. లేనిపక్షంలో మళ్లీ సార్వత్రికఎన్నికలు అనివార్యం. స్పెయిన్ జాతీయ జట్టు మహిళల సాకర్ (ఫుట్‌బాల్) ప్రపంచ కప్ గెలుపొందిన సంబురాల్లో యావద్దేశం మునిగితేలుతుండగా, చిన్నాభిన్నంగా ఉన్న దేశ రాజకీయ పరిస్థితిలో కూడా స్పష్టత వస్తున్నది. ఈ ఆగస్టు మధ్య ఎండలవేడిలో అధికార వసారాల్లోకూడా ఏదో మార్పుగోచరిస్తోంది. అంతిమ ఫలితం శిలాక్షరంలాగా కనిపించకపోయినా అనూహ్యమైన మలుపులు ఊహించబడుతున్నాయి.

జులై 23న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మితవాద సమష్టిశక్తులు ఓటమిపొందాయి. యూరప్‌లో సగభాగం ఊపిరి పీల్చుకుంది. మితవాద పార్టిడో పాపులర్(పిపి) ఊహించినట్లు 137 సీట్లు గెలుచుకుని కాంగ్రెస్ ప్రథమస్థానంలో నిలిచింది. అయితే 350 సీట్లు కలిగిన కాంగ్రెస్‌లో సింపుల్ మెజారిటీకి బహుదూరంలోఉంది. పచ్చిమితవాద వోక్స్‌పార్టీ లెజిస్లేటర్లు 33 మందిని జతచేసినా ఇంకనూ బారెడు దూరంలోనే ఉంటుంది. కాగా ప్రస్తుత ప్రధానమంత్రి (పార్టిడో సోషలిస్టా ఒబెరెరో ఇస్పానోల్-పిఎస్ఒఇ) నాయకుడు పెడ్రో సాంచెజ్ ఓటమి ఊహించినప్పటికీ, జులైలో జరిగిన ఆకస్మిక ఎన్నికల్లో ఆయనే విజేతగా కనిపిస్తున్నారు. ఆయన పార్టీ తరఫు/న 121 మంది ఎంపీలే గెలిచారు. కార్మికమంత్రి యెర్లాండ డియాజ్ నాయకత్వంలోని వామపక్ష కూటమి 'సమర్' తరఫున 31మంది గెలుపొందారు. మ్యాజిక్ సంఖ్య 176. సోషలిస్టులు, వామపక్ష సంఖ్య 152. లోటు 14. అయితే ఇతర చిన్నచిన్న పార్టీల నుంచి తోడ్పాటుపొందే అవకాశం వీరికే ఉంది. గత పార్లమెంటులో కూడా, వివిధ జాతీయవాద, ప్రాంతీయపార్టీల బాహ్యతోడ్పాటుతో ఈ వామపక్ష శక్తులే మెజారిటీ ప్రభుత్వంతో పారిపాలన సాగించాయి. ఆ పార్టీల తోడ్పాటుపొందటంలో ఇబ్బందయినా, అది సాధ్యమేనని స్పీకర్‌గా సోషలిస్టు అభ్యర్థిని ఎన్నిక చెబుతున్నది. అంతేగాక, కాంగ్రెస్ కార్యకలాపాల నిర్వహణను నిర్ణయించే బిజినెస్ అడ్వయిజరీ కమిటీ ఎన్నికల్లో కూడా స్వల్ప లెఫ్ట్ మెజారిటీ సాధించింది. పిఎస్ఒఇ ప్లస్ సుమర్ నుంచి ఐదుగురు సభ్యులు ఎన్నికకాగా పిపిప్లస్ వోక్స్‌నుంచి నలుగురే ఎన్నికైనారు. ఇదీ శు భసూచకమే. సోషలిస్టులు, కెటాలన్ స్వాతంత్ర్యపార్టీల మధ్య ఆఖరు నిమిషంలో కుదిరిన ఒప్పందం ఈ సానుకూల ఫలితానిచ్చింది. ప్రధానిగా సాంచెజ్ తిరిగి ఎన్నిక కావటానికి ఇది మార్గం చూపింది. ఇందుకుగాను పార్టీలు కొన్ని రాయితీలు పొందాయి. ఒకటి, ప్రభుత్వసంస్థలు, యూరోపియన్ యూనియన్‌లో అధికారభాషగా కేటలాన్‌లు గుర్తించడం(ఆ భాష మాట్లాడే ప్రాంతాల్లో ఇప్పుడది సహ-అధికార భాషగా ఉంది). రెండు, పెగాసస్ గూఢచారి పరికరం ఉపయోగించటంపై పార్లమెంటరీ కమిషన్ ఏర్పాటు. పలువురు కెటాలన్ స్వాతంత్ర్య పోరాట నాయకులపై, ప్రధాని సాంచెజ్‌పై కూడా పెగాసస్ ప్రయోగించారనే ఆరోపణలున్నాయి. మూడు, 2017 ఆగస్టులో బార్సిలోనా, కాంబ్రిల్స్‌లో ఇస్లామిస్ట్ దాడులపై మరో దర్యాప్తు కమిషన్ ఏర్పాటు. కాటాలన్ వేర్పాటువాదాన్ని అణచివేయటానికి ఆ దాడులవెనుక రాజ్య హస్తముందని ఆ స్వాతంత్ర్యోద్యమ నాయకులు అన ఎమానిస్తున్నారు. చివరగా, 2017 ఆకురాలు కాలంలో కెటాలన్ పార్లమెంటు అనధికారికంగా స్వాతంత్ర్య రిఫరెండం నిర్వహించినపుడు స్వాతంత్ర్య అనుకూల శక్తులపై రాజ్యం విధించిన అణచివేతను (కేసులు వగైరా లీగల్‌గా ముగించటం. కెటాలియన్ ఇండిపెండెన్స్ పార్టీలు తమసొంత పార్లమెంటరీ పార్టీ ఏర్పాటుకు అవసరమైన సభ్యులను తమనుండి ఇవ్వటానికి సోషలిస్టులు అంగీకరించారు. కోర్టు అభియోగాలు ఎదుర్కొంటున్న కెటాలిన్ స్వాతంత్ర్య ఉద్యమకారులకు క్షమాబిక్ష ప్రకటించాలని, స్వాతంత్ర్యంపై రిఫరెండం నిర్వహించాలని కెటాలిన్ ఉద్యమ నాయకుడు ఫ్యుయిగ్ డెమోంట్ కొద్దివారాల క్రితం వరకు కోరుతూ వచ్చాడు. రిఫరెండం రాజ్యాంగంరీత్యా నిషేధం. సహ అధికార భాషలు-కెటాలిన్, బాస్క్యు, గాలిసయన్ దేనిలోనైనా సభ్యులు కాంగ్రెస్‌లో మాట్లాడేందుకు స్పీకర్ ఆర్మెంగోల్ అంగీకరించారు. యూరోపియన్ యూనియన్ అంతటా మూడుభాషలకు అధికార హోదా ఇవ్వాలని స్పానిష్ విదేశీ వ్యవహారాలమంత్రి యూరోపియన్ కౌన్సిల్‌ను అధికారికంగా కోరారు. ఈ ఒప్పందానికి విస్తృత ప్రాముఖ్యత ఉంది. ప్రధాన మితవాద కెటాలిన్ ఇండిపెండెన్స్ పార్టీ దశాబ్దం తర్వాత మాడ్రిడ్‌లో రాజకీయాల్లోకి తిరిగివస్తున్నది. గత నెలలో సార్వత్రిక ఎన్నికల్లో కెటాలిన్ వేర్పాటువాద పార్టీలు గత రెండు దశాబ్దాల్లోనే అతి దారుణమైన ఫలితాలు పొందాయి. బార్సిలోనా, మాడ్రిడ్ మధ్య సంభాషణ, ఉద్రిక్తోపశమనం ద్వారా రాజకీయ పరిష్కారాన్ని ఎల్లప్పుడూ కోరుతూ వస్తున్నా సోషలిస్టు, వామపక్ష అభ్యర్థులకు ఈ పర్యాయం కెటాలియన్‌లలో అత్యధికులు ఓటు చేశారు. 2017 ఘటనకుగాను క్రిమినల్ శిక్షలు విధించబడిన కెటాలన్ నాయకులకు రెండేళ్లక్రితం సోషలిస్టు, వామపక్ష ప్రభుత్వం మితవాదులు, వారి మీడియా వ్యతిరేకతను త్రోసిపుచ్చి క్షమాబిక్ష ప్రకటించడం సుహృద్భావ వాతావరణం ఏర్పరిచింది. అయినా సాంఛెజ్ ప్రభుత్వ ఏర్పాటుకు దీర్ఘకాలమేపట్టే సూచనలు కనిపిస్తున్నాయి. రాజు-రాజ్యాంగం రాజు ఫిలిప్-6 ప్రభుత్వం ఏర్పాటుకు తొలి అవకాశాన్ని పిపి పార్టీకిస్తూ గత మంగళవారం ఆహ్వానం పంపారు. 'సాంప్రదాయం' పేరుతో ఆయనదాన్ని సమర్థించారు. ఇప్పుడు అందరి కళ్లు సెప్టెంబరు 26పై ఉన్నాయి. పిపి నాయకుడు ఫీజూ ఆ రోజున పార్లమెంటు ముందుకు వస్తాడు. రాజ్యాంగం ప్రకారం ఆ మరునాడు ప్రధానిగా పార్లమెంటు ఆమోదం పొందాలి. సభ మొత్తం సంఖ్యాబలంలో మెజారిటీ రావాలి. అందులో విఫలమైతే, రెండ్రోజుల తర్వాత-సెప్టెంబరు 29న మరోసారి ఓటుకోరాలి. అందులో సాపేక్షిక మెజారిటీ ప్రత్యర్థికన్నా ఎక్కువ ఓట్లు చాలు. అందులో కూడా ఫీజీ విఫలమైతే, రాజు పార్టీ నాయకులతో సంప్రదించి ప్రధానమంత్రిగా కొత్త అభ్యర్థిని నియమిస్తారు. ఈ క్రమం అంతా నడిస్తేనేగాని సాంచెజ్ వంతురాదు. అయితే కాలం కత్తి మెడమీద వేలాడుతుంది. మొదటి ఓటు జరిగిన ఆరురోజుల్లో ఏ అభ్యర్థి అయినా విశ్వాస ఓటు పొందలేకపోతే పార్లమెంటు ఆటోమేటిక్‌గా రద్దవుతుంది. జనవరి 14న మళ్లీ సార్వత్రిక ఎన్నికలు జరుగుతాయి. అందువల్ల వచ్చే నెల కీలకం.

దిల్లీ మద్యం కుంభకోణం...

ఇద్దరు ఈడీ అధికారులపై సీబీఐ కేసు

మనీలాండరింగ్ ఆరోపణలు కూడా

న్యూదిల్లీ: దిల్లీ మద్యం కుంభకోణం కేసు నుంచి తప్పించేందుకు వ్యాపారుల నుంచి లంచం తీసుకున్నట్లు తమ సంస్థ అధికారులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ (ఈడీ) కేసు పెట్టింది. నిందిత అధికారులపై మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద చర్యలు తీసుకోబోతోంది. వారిపై వేటు వేసేందుకు సిద్ధమైంది. ఇద్దరు ఈడీ అధికారులు, మరికొందరు ప్రైవేటు వ్యక్తులపై కేసును సీబీఐకి అప్పగించినట్లు ఈడీ అధికారులు మంగళవారం తెలిపారు. ఈడీ అసిస్టెంట్ డైరెక్టర్ పవన్ ఖత్రీ, ఈడీ అప్పర్ డివిజన్ క్లర్క్ నితీశ్ కోహర్‌తో పాటు చార్టర్డ్ అకౌంటెంట్ ప్రవీణ్ కుమార్ వత్స్, ఎయిర్ ఇండియా ఏజీఎం దీపక్ సంగ్వాన్, క్లారిడ్జ్ హోటల్స్ & రిసార్ట్స్ సీఈవో విక్రమాదిత్య, మద్యం వ్యాపారి అమర్‌దీప్ ధాల్, అతని తండ్రి బీరేంద్ర పాల్ సింగ్‌ను నిందితులుగా పేర్కొంటూ ఈనెల 25న ఎఫ్ఐఆర్ నమోదైందని అధికారులు చెప్పారు. ఈనెల 8న ఈడీ చేసిన ఫిర్యాదుపై సీబీఐ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నిందిత అధికారులకు దిల్లీ మద్యం కుంభకోణం కేసు విచారణతో సంబంధం లేదన్నారు. మార్చి 1న ధాల్‌ను ఈడీ అరెస్టు చేసింది. దిల్లీ మద్యం కుంభకోణం కేసులో ధాల్ అరెస్టు కాకుండా ఉండేందుకు, ఆయనను నిందితుడిగా పేర్కొనకుండా చేసేందుకు 2022 డిసెంబరు నుంచి రూ.50లక్షలు చొప్పున రూ.5కోట్ల లంచాన్ని అధికారి వత్స్‌కు వ్యాపారి తండ్రి చెల్లించినట్లు ఆరోపించింది. సీబీఐ తాజా ఎఫ్ఐఆర్ ఆధారంగా పీఎంఎల్ఏ కేసు పెట్టిన తర్వాత మనీలాండరింగ్ ఆరోపణల కింద నిందితుల విచారణను చేపట్టనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. మద్యం కుంభకోణంపై విచారణతో సంబంధం లేని (నిందిత) అధికారుల ఇళ్లలో నుంచి కేసుకు సంబంధించిన పత్రాలు లభ్యమైనట్లు దర్యాప్తు అధికారులు వెల్లడించారు. ధాల్‌కు సహకరించేందుకు వత్స్‌కు రూ.5కోట్లను చెల్లించినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కేసు ఆధారంగా ఐపీసీలోని 120బీ, అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ల కింద సీబీఐ కేసు నమోదైంది. మద్యం కుంభకోణం కేసును తప్పుదారి పట్టించేందుకు పెద్ద మొత్తాలు సీనియర్ అధికారుల చేతులు మారినట్లు ఈడీకి అందిన సమాచారం ఆధారంగా జులై 4న తనిఖీలు, నిందితుల విచారణలు జరిపినట్లు అధికారులు చెప్పారు. విక్రమాదిత్య మినహా నిందితుల ఆస్తులను సోదా చేశారు. వత్స్ ఇంటి నుంచి రూ.2.19కోట్ల నగదు (రూ.5కోట్ల లంచం సొత్తులో నుంచి), రూ.1,90,64,400 విలువ చేసే ఆభరణాలు, బీఎండబ్ల్యూ కారు లభ్యమైనట్లు అధికారులు తెలిపారు. రూ.2.26కోట్ల బ్యాంకు డిపాజిట్లను పీఎంఎల్ఏ కింద ఫ్రీజ్ చేసినట్లు చెప్పారు. సంగ్వాన్ ఇంటి నుంచి మద్యం కుంభకోణం కేసులో జనవరి 9న నమోదైన సప్లిమెంటరీ ఫిర్యాదు తాలూకు 99 పేజీలు లభించాయని, సీనియర్ అధికారుల పేర్లతో ఇతను లంచం తీసుకుంటున్నట్లు వెల్లడైందని అన్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ ఖత్రీ వద్ద నుంచి కుంభకోణం కేసు పత్రాలు దొరికడాన్ని బట్టి ఈ కేసుపై ఆయన ప్రత్యేక శ్రద్ధ వహించారని తేలిందని పేర్కొన్నారు. నిందితుల జాబితా నుంచి ధాల్‌ను తప్పించేందుకు రూ.2కోట్లను సంగ్వాన్ డిమాండు చేసినట్లు అధికారులు తెలిపారు. విక్రమాదిత్య ద్వారా వత్స్‌తో ధాల్‌కు పరిచయం ఏర్పడిందని, ఈ కేసులో విక్రమాదిత్య సహకారాన్ని ధాల్ తీసుకున్నారని ఎఫ్ఐఆర్‌లో ఉంది.

ప్రజాస్వామ్య పునరుద్ధరణ ఎప్పుడు?

జమ్ముకశ్మీరుపై సుప్రీం సూటిప్రశ్న

న్యూదిల్లీ: జమ్ముకశ్మీరుకు కేంద్రపాలిత ప్రాంతం హోదా అనేది శాశ్వతమేమీ కాదని కేంద్ర ప్రభుత్వం మంగళవారం సుప్రీంకోర్టుకు తెలిపింది. ఇది రాజకీయ అంశాలతో ముడిపడి ఉన్నందున ఆగస్టు 31వ తేదీన పూర్తిస్థాయి వాదనలు వినిపిస్తామని విజ్ఞప్తి చేసింది. జమ్ముకశ్మీరులో ఆర్టికల్ 370 రద్దును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం కొంతకాలంగా రోజువారీ విచారణ చేస్తోంది. దీనికి సంబంధించి కేంద్రప్రభుత్వం సమాధానాన్ని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ధర్మాసనానికి వివరించారు. జమ్ముకశ్మీరులో ఎన్నికల ప్రజాస్వామ్య పునరుద్ధరణకు సంబంధించి నిర్దిష్టకాలపరిమితిని నిర్ణయించండని పిటిషనర్లు సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి చేశారు. 'జమ్ముకశ్మీరుకు కేంద్రపాలిత ప్రాంతం హోదా శాశ్వతమేమీ కాదు. ఇప్పటి వరకు లడాఖ్‌కు సంబంధించి కొంతకాలం కేంద్రపాలిత ప్రాంతంగా కొనసాగుతుంది' అని మెహతా చెప్పారు. జమ్ముకశ్మీరు, లడాఖ్‌కు కేంద్రపాలిత ప్రాంతం భవిష్యత్‌పై తాను ధర్మాసనం పూర్తిస్థాయి ప్రకటనను ఆగస్తు 31న చేస్తానని ప్రభుత్వం తరపున మెహతా చెప్పారు. జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సుర్యకాంత్ ధర్మాసనంలో సభ్యులుగా ఉన్నారు. మెహతా వాదనల అనంతరం ధర్మాసనం జోక్యం చేసుకుంటూ జాతీయ భద్రతా పరిస్థితులను మనం అర్థం చేసుకున్నప్పటికీ ప్రజాస్వామ్యం అత్యంత ముఖ్యం. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ జరగాల్సిందేగా అని ప్రశ్నించింది. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరపకపోవడాన్ని అంగీకరించలేమని ధర్మాసనం స్పష్టంచేసింది. 'జమ్ముకశ్మీరులో వాస్తవిక ప్రజాస్వామ్య పునరుద్ధరణ ఎప్పుడు జరుగుతుంది. ఇందుకు నిర్దిష్ట కాలపరిమితిని చెప్పండి. దీనిని మేము రికార్డు చేస్తాం' అని ధర్మాసనం గట్టిగా ప్రశ్నించింది. దీనికి సంబంధించి ప్రభుత్వం నుంచి సమాచారం తీసుకొని...కోర్టుకు విన్నవించాలని మెహతా, అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణిని ధర్మాసనం ఆదేశించింది.

అప్పుడు శ్రీహరికోటకు

ఎన్టీఆర్‌ను ఇందిర ఆహ్వానించారు

కాంగ్రెస్ నేత జైరాం రమేశ్

న్యూదిల్లీ: 1983లో ఎస్ఎల్‌వీ-3-డి2 విజయవంతంగా ప్రయోగించిన తర్వాత, రాజకీయ ప్రత్యర్థులుగా ఉన్నప్పటికీ, అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ శ్రీహరికోటకు రావాల్సిందిగా ఎన్.టి.రామారావును ఆహ్వానించారని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ మంగళవారం గుర్తు చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వారాంతంలో తన పర్యటన సందర్భంగా హెచ్ఏఎల్ విమానాశ్రయంలో తనను ఆహ్వానించకుండా కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి శివకుమార్‌ను అడ్డుకున్నారని కాంగ్రెస్ ఆరోపించిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు వచ్చాయి. సుదీర్ఘ విమాన ప్రయాణం తర్వాత తాను వచ్చే సమయం గురించి కచ్చితంగా తెలియకపోవడంతో ఉదయాన్నే వచ్చేందుకు వారు ఇబ్బంది పడకూడదనుకోవడంతో తనను ఆహ్వానించేందుకు కర్నాటక గవర్నర్, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిని విమానాశ్రయానికి రావద్దని కోరినట్లు మోదీ శనివారం చెప్పారు. చంద్రునిపైకి చంద్రయాన్-3 మిషన్‌లో పాల్గొన్న ఇస్రో శాస్త్రవేత్తలతో కలిసేందుకు ప్రధాన మంత్రి శనివారం ఉదయం 6 గంటలకు గ్రీస్ రాజధాని ఏథెన్స్ నుంచి నేరుగా బెంగళూరు చేరుకున్నారు. ఈ సంఘటన గురించి ప్రస్తావించకుండా 'ఎక్స్' లో ఒక పోస్ట్‌లో జైరాం రమేశ్ ఇలా పేర్కొన్నారు. 'వారు రాజకీయ ప్రత్యర్థులు, కానీ ఇందిరా గాంధీ ఏప్రిల్ 17, 1983న ఎస్ఎల్‌వీ-3-డి2 ను విజయవంతంగా ప్రయోగించిన తర్వాత ఎన్.టి.రామారావును శ్రీహరికోటకు ఆహ్వానించారు. ఇది వేద్ ప్రకాష్ శాండ్లాస్ 2018 క్లాసిక్, 'ది లీప్ ఫ్రాగర్స్' నుంచి' అని ఆయన వివరించారు. ఎస్ఎల్‌వీ-3 రోహిణి ఉపగ్రహం ఆర్ఎస్-డీ2ను తీసుకువెళ్లింది. విమానాశ్రయంలో ప్రధాన మంత్రిని ఆహ్వానించే విషయంలో ప్రోటోకాల్‌ను విస్మరించడంపై బీజేపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఆర్.అశోక, శివకుమార్ మధ్య మాటల యుద్ధం కూడా చోటుచేసుకుంది.

బీహార్‌లో కుల సర్వేను అడ్డుకునేందుకు కేంద్రం ప్రయత్నం

ఆర్‌జేడీ ఆరోపణ

న్యూదిల్లీ: బీహార్‌లో కులాల సర్వేను ఆపేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని, సమాజంలోని పెద్ద వర్గానికి చెందిన వారి హక్కులను 'హరించేలా' చేసిందని రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జేడీ) మంగళవారం ఆరోపించింది. ఈ అంశంపై సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు హాజరు కావడం కుల సర్వేను అడ్డుకునే ప్రయత్నంలో ప్రధాన మంత్రి కార్యాలయం (పీఎంవో) ప్రత్యక్ష ప్రమేయం ఉందని ఆర్‌జేడీ ఎంపీ, పార్టీ అధికార ప్రతినిధి మనోజ్ ఝా అన్నారు. 'పీఎంవో ఆదేశాల మేరకు బీహార్‌లో దాదాపుగా పూర్తి అయిన కులాల సర్వేను అడ్డుకునే ప్రయత్నం జరుగుతోంది. బీజేపీ, సంఘ్ సమాజంలోని అటువంటి పెద్ద వర్గం వారి హక్కులను హరించాలని కోరుకుంటున్నట్లు ఇది చూపిస్తుంది. ఇది వారి ప్రాధాన్యత' అని ఝా ఒక వీడియోలో తెలిపారు. ఈ అంశం రాజ్యాంగంలోని యూనియన్ జాబితా కిందకు వస్తుంది అందువల్ల సంబంధిత చట్టం ప్రకారం జనాభా గణనను నిర్వహించే అధికారం తమకు మాత్రమే ఉందని కేంద్రం సుప్రీం కోర్టుకు తెలిపిన మరుసటి రోజు తర్వాత ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బీహార్‌లో కులాల సర్వేకు పాట్నా హైకోర్టు అనుమతి ఇవ్వడాన్ని సవాలు చేస్తూ దాఖలయిన పిటిషన్ల సమూహానికి సంబంధించి దాఖలు చేసిన అఫిడవిట్‌లో రాజ్యాంగం, వర్తించే చట్టం నిబంధనలకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీలు, ఎస్ఈబీసీలు, ఎస్ఈబీసీల అభ్యున్నతి కోసం భారత యూనియన్ కట్టుబడి ఉన్నట్లు కేంద్రం పేర్కొంది. ఝా తన వ్యాఖ్యలలో 'కుల సర్వేను నిరోధించడంలో పీఎంవో ప్రత్యక్షంగా ప్రమేయం ఉందని తుషార్ మెహతా హాజరుకావడం స్పష్టం చేస్తుంది. అఫిడవిట్‌లోని ఐదవ అంశం 'జనాభా లెక్కలు, జనాభా గణనకు సమానమైనది' అని పేర్కొంది. ఇది సర్వేను కూడా నిరోధించే ప్రయత్నం ఉందని చూపిస్తుంది. ఇది అనుకోకుండా జరిగిన తప్పిదమని వారు చెప్పారు. అయితే, ఇది 'అనుకోకుండా కాదు', ఉద్దేశపూర్వకంగా సర్వేను అడ్డుకుంది' అని అన్నారు. 'మీరు (కేంద్రం) సమాజంలోని ఇంత పెద్ద వర్గం హక్కులను హరించడం ద్వారా ఒక అగ్నిపర్వతానికి ప్రాణం పోస్తున్నారు. ఇవన్నీ చేయడం ద్వారా మీరు బయటపడుతున్నారు. కుల సర్వేను ఆపలేరు' అని ఆయన తెలిపారు.

ఇద్దరు బాలురుపై సహ విద్యార్థుల లైంగికదాడి

వైస్ ప్రిన్సిపాల్, టీచర్లపై సస్పెన్షన్ వేటు

న్యూదిల్లీ: దిల్లీలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో ఇద్దరు బాలురుపై సహ విద్యార్థులు లైంగికదాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తీవ్రంగా స్పందించారు. లైంగికదాడికి సంబంధించిన వ్యవహారాన్ని పోలీసులకు ఫిర్యాదు చేయడంలో విఫలమైనందుకు పాఠశాల వైస్‌ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను సస్పెండ్ చేయాలని కేజ్రీవాల్ మంగళవారం ఆదేశించారు. పాఠశాలల్లో లైంగిక వేధింపులు వంటి ఘటనలు జరగకుండా చూడాలని విద్యాశాఖ డైరెక్టరేట్‌ను కేజ్రీవాల్ ఆదేశించారు. లైంగికదాడులు, వేధింపులు జరగకుండా నివారించడానికి అనుసరించాల్సిన పద్ధతుల గురించి ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులకు వివరించాలని, అందుకు అవసరమైన మెటీరియల్‌ను అందజేయాలని స్పష్టం చేశారు. పాఠశాలల్లో విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోవడానికి వీలులేదని చెప్పారు. ముఖ్యమంత్రి అదేశాల మేరకు లైంగిక నేరాలకు సంబంధించి పిల్లల రక్షణ చట్టంలోని నిబంధనలపై ప్రిన్సిపాల్స్, టీచర్లకు శిక్షణ ఇవ్వాలని దిల్లీ విద్యాశాఖ మంత్రి అతిషి విద్యాశాఖ డైరెక్టరేట్‌కు లేఖ రాశారు. విద్యార్థులపై లైంగికదాడి, వేధింపులను ప్రాథమికదశలోనే గుర్తించడం, ఏ రకంగా వేధింపులకు గురిచేస్తున్నారు... విద్యార్థులపై వేధింపుల ప్రభావం ఎలా ఉంటుంది...ఇలాంటి ఘటనలు భవిష్యత్‌లో జరగకుండా అనుసరించాల్సిన విధానాలపై శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పిల్లలను మానసికంగా కుంగదీస్తాయని మంత్రి అతిషి పేర్కొన్నారు. టీచర్లు, వైస్‌ప్రిన్సిపాల్‌కు విద్యార్థులు సమాచారమిచ్చినా...ఆ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడం లేదా ఉన్నతాధికారుల దృష్టికి తేవకపోవడం ఆందోళన కలిగిస్తోందని మంత్రి తెలిపారు. ఇది అనైతికమే కాకుండా చట్టవిరుద్ధమని స్పష్టంచేశారు. పోక్సో చట్టం ప్రకారం లైంగికవేధింపుల గురించి ఫిర్యాదు చేయకపోవడం నేరమని వ్యాఖ్యానించారు.

కాగా, ఐదారుగురు క్లాస్‌మేట్లు తమపై లైంగికదాడికి పాల్పడినట్లు 12, 13 ఏళ్ల వయస్సు గల ఇద్దరు బాలురు వేర్వేరుగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏప్రిల్‌లో పాఠశాల నిర్వహించిన సమ్మర్ క్యాంపు సమయంలో ఈ ఘటన జరిగినట్లు పోలీసులు తెలిపారు. క్లాస్‌మేట్లు బలవంతంగా పార్కులోకి లాకెళ్లి తనపై లైంగికదాడికి పాల్పడినట్లు 8వ తరగతి విద్యార్థి చెప్పాడని, ఈ విషయం బయటపెట్టవద్దని బెదిరించారని అధికారులు చెప్పారు. కొద్దిరోజుల తర్వాత ఆ విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తడంతో నాటి ఘటన గురించి టీచర్లకు ఫిర్యాదు చేశారు. టీచర్లు సైతం ఈ విషయాన్ని ఎవరికీ చెప్పవదని బెదిరించారు. దీంతో విద్యార్థులు తమ తల్లిదండ్రులకు చెప్పగా ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రూ.44 కోట్ల విలువైన మాదకద్రవ్యాల పట్టివేత

కోజికోడ్ (కేరళ): కరిపూర్‌లోని కోజీకోడ్ కాలికట్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఒక ప్రయాణికుడి నుంచి కొకైన్, హెరాయిన్ సహా రూ.44 కోట్ల విలువైన మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నట్లు డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) మంగళవారం వెల్లడిం చింది. డీఆర్ఐ కొచ్చిన్ జోనల్ యూనిట్ అధ్వర్యంలోని కాలికట్ రీజినల్ యూనిట్ ఉత్తరప్రదేశ్‌లోని ముసాఫర్ నగర్ నివాసి రాజీవ్ కుమార్ నుండి 3.5 కిలోల కొకైన్, 1.3 కిలోల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకుంది. స్వాధీనం చేసుకున్న డ్రగ్స్ విలువ రూ.44 కోట్లని డీఆర్ఐ అధికారులు తెలిపారు. కెన్యాలోని నైరోబీ నుంచి షార్జా మీదుగా ఎయిర్ అరేబియా విమానంలో వచ్చిన రాజీవ్‌కుమార్‌ను డీఆర్ఐ అధికారులు సోమవారం కాలికట్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అడ్డుకున్నారు. సదరు ప్రయాణికుడి నుంచి 4.8 కిలోల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. నిందితుడు తన చెక్-ఇన్ బ్యాగేజీలో బూట్లు, హ్యాండ్ పర్సులు, హ్యాండ్ బ్యాగులు, పిక్చర్ బోర్డులు, ఫైల్ ఫోల్డర్‌లు వంటి వస్తువులలో నిషిద్ధ మాదకద్రవ్యాలను దాచిపెట్టినట్లు చెప్పారు. నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నామని, తదుపరి విచారణ కొనసాగుతోందని డీఆర్ఐ అధికారులు పేర్కొన్నారు.

సెప్టెంబరులో రాహుల్ యూరప్ పర్యటన

న్యూదిల్లీ: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వచ్చే నెలలో యూరప్‌లో పర్యటించి బెల్జియంలోని యూరోపియన్ కమిషన్ చట్టసభ సభ్యులతో పాటు పారిస్‌లోని విశ్వవిద్యాలయం విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించే అవకాశం ఉంది. సెప్టెంబరు మొదట్లో ఓస్లోలో జరిగే కార్యక్రమంలో ఆయన ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రసంగించే అవకాశం ఉందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. సెప్టెంబరు 9 నుంచి 10 వరకు దేశ రాజధాని దిల్లీలో కీలకమైన జీ20 సదస్సు జరగనున్న తరుణంలో ఆయన విదేశాలకు వెళ్లడం గమనార్హం. ప్రస్తుతం భారతదేశం జీ20 అధ్యక్ష పదవిని కలిగి ఉంది. ఐదు రోజుల పర్యటన కోసం రాహుల్ సెప్టెంబరు మొదటి వారంలో పారిస్ వెళ్లే అవకాశం ఉందని ఆ వర్గాలు తెలిపాయి. సెప్టెంబరు 7న బ్రస్సెల్స్‌లో యూరోపియన్ యూనియన్ సభ్యులతో జరిగే సమావేశంలో ఆయన పాల్గొంటారు. కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు 8న పారిస్‌లోని ఒక విశ్వవిద్యాలయంలో విద్యార్థులను ఉద్దేశించి ఉపన్యాసం చేస్తారు. సెప్టెంబరు 9న పారిస్‌లో జరిగే ఫ్రాన్స్ లేబర్ యూనియన్ నాయకులతో సమావేశంలో కూడా ఆయన పాల్గొననున్నారు. ఆ తర్వాత, గాంధీ నార్వేకు వెళ్లాల్సి ఉందని, అక్కడ సెప్టెంబరు 10న ప్రవాస భారతీయుల కార్యక్రమంలో ప్రసంగిస్తారని, ఆ తర్వాత విలేకరుల సమావేశం కూడా నిర్వహించవచ్చునని ఆ వర్గాలు తెలిపాయి.

హోం వ్యవహారాల స్టాండింగ్ కమిటీలో చిదంబరం

న్యూదిల్లీ: హోంశాఖ మాజీ మంత్రి, కాంగ్రెస్ ఎంపీ పీ చిదంబరాన్ని హోంవ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి రాజ్యసభ జగదీప్ ధన్కర్ మంగళవారం నామినేట్ చేశారు. కాంగ్రెస్ సభ్యుడు పీ భట్టాచార్య రాజ్యసభ సభ్యునిగా పదవీ విరమణ చేసిన క్రమంలో చిదంబరం నామినేషన్ తెరపైకి వచ్చింది. హోంమంత్రిత్వశాఖ వ్యవహారాల పార్లమెంటరీ కమిటీ ప్రస్తుతం నేర చట్టాలైన ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ), క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సీఆర్‌పీసీ), భారతీయ సాక్ష్యం చట్టం స్థానంలో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన మూడు కొత్త బిల్లుల (భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య)ను పరిశీలిస్తోంది. 'రాజ్యసభ చైర్మన్, ఆగస్టు 28, 2023న రాజ్యసభ సభ్యుడు శ్రీ పి. చిదంబరాన్ని హోంవ్యవహారాల కమిటీకి, ఆగస్టు 18, 2023 న రాజ్యసభ సభ్యత్వం నుంచి పదవీ విరమణ చేసిన పి. భట్టాచార్య స్థానంలో నామినేట్ చేశారు' అని రాజ్యసభ సెక్రటేరియట్ నుంచి ఓ ప్రకటన విడుదలైంది. ప్రతిపాదిత మూడు ప్రతిపాదిత చట్టాలను రాజ్యసభ చైర్మన్ ధన్కర్... ఆగస్టు 18న పరిశీలన కోసం హోంవ్యవహారాల శాఖ స్టాండింగ్ కమిటీకి పంపారు. దీనిపై నివేదికను మూడు నెలల్లో సమర్పించాలని కోరారు. ఈ మూడు బిల్లులను ఆగస్టు 11న హోంమంత్రి అమిత్ షా లోక్‌సభలో ప్రవేశపెట్టారు. హోం వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలో పార్లమెంటు ఉభయ సభల నుంచి సభ్యులు ఉంటారు. బీజేపీ సభ్యుడు బ్రిజ్ లాల్ కమిటీకి చైర్మన్‌గా ఉన్నారు.

సతారాలో మహిళపై దాడి...నలుగురి అరెస్టు

ముంబై: తీసుకున్న డబ్బు తిరిగి ఇవ్వమని అడిగిన ఓ మహిళపై దాడికి పాల్పడిన నలుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆగస్టు 26న మహారాష్ట్రలోని సతారా జిల్లా మాన్ తాలూకా పరిధిలోని పన్వన్ గ్రామంలో ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే... గ్రామంలో వెనుకబడిన వర్గానికి చెందిన ఒక మహిళ పశువుల మేత కోసం ఇచ్చిన రూ. 2వేలు తిరిగి ఇవ్వాలని ప్రధాన నిందితుడు దేవదాస్ నరాలేను ఆగస్టు 25న అడిగింది. పదేపదే అడిగినప్పటికీ అగ్రవర్ణానికి చెందిన నరాలే డబ్బు తిరిగి ఇవ్వకుండా ఆ మహిళను దుర్భాషలాడి, బెదిరించాడు. శనివారం ఉదయం మరో ముగ్గురితో కలిసి బాధితురాలి వద్దకు వెళ్లి గ్రామస్తుల ఎదుటే కొట్టడం ప్రారంభించాడు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఆమెను కొడుతున్నప్పుడు నిందితులు ఆమెను బలాత్కరించే ప్రయత్నం చేశారని, ఘోరంగా అవమానించారని పోలీసులు తెలిపారు. బాధితురాలి కుమారుడు ఫిర్యాదు మేరకు హస్వాద్ పోలీసులు... భారతీయ శిక్షాస్మృతి సెక్షన్లు 354, 323, 324 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కాగా పోలీసులు ఆదివారం ప్రధాన నిందితుడు నరలే, పింటూ అలియాస్ శాంతారామ్ నరాలేలను అరెస్టు చేశారు. మిగిలిన ఇద్దరు నిందితులు - సంతోష్ షిండే, జానప్ప షిండేలను సోమవారం సాయంత్రం పట్టుకున్నట్లు వెల్లడించారు.

దిల్లీని ఎప్పటికీ శుభ్రంగా ఉంచుకోవాలి: కేజ్రీవాల్

న్యూదిల్లీ: రాబోయే జీ20 సమ్మిట్‌కు మాత్రమే కాకుండా నగరాన్ని ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ మంగళవారం ప్రజలను కోరారు. 'గత కొన్నివారాలుగా దిల్లీ ఎమ్మెల్యేలు, కౌన్సిలర్లు, స్వీపర్లు నగరాన్ని పరిశుభ్రంగా మార్చడానికి చాలా కష్టపడ్డారు. పీడబ్ల్యూడీ, ఎంసీడీ, ఇతర విభాగాలకు చెందిన ఉద్యోగులు, ఇంజనీర్లు కూడా కష్టపడ్డారు. ఈ పరిశుభ్రత కేవలం జీ-20 సమ్మిట్‌కు మాత్రమే పరిమితం కాదు... ఇప్పుడూ ఇంకెప్పటికీ దిల్లీని ఇలా శుభ్రంగా ఉంచుకోవాలి' అని కేజ్రీవాల్ పేర్కొన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. అంతకుముందు మోతీ బాగ్‌లో సమ్మిట్ ఏర్పాట్లను పట్టణాభివృద్ధి శాఖ మంత్రి సౌరభ్ భరద్వాజ్ పరిశీలించారు.

డబ్ల్యూఎఫ్ఐ ఎన్నికలపై 'స్టే' ఎత్తివేతకు సుప్రీం విముఖత



న్యూదిల్లీ: రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఎఫ్ఐ) ఎన్నికలపై స్టే విధిస్తూ పంజాబ్, హరియాణా హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై జోక్యం చేసుకోవడానికి సుప్రీంకోర్టు మంగళవారం నిరాకరించింది. ఆగస్టు 11న హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. తన ఫిర్యాదులపై హైకోర్టును ఆశ్రయించాలని న్యాయమూర్తులు అభయ్ ఎస్ ఓకా, పంకజ్ మిథాల్‌లతో కూడిన ధర్మాసనం పిటిషనర్‌ను కోరింది. 'దీనిని మేం ఎందుకు ప్రోత్సహించాలి? మీరు హైకోర్టుకు వెళ్లండి...మధ్యంతర స్టేను ఎత్తివేసేందుకు దరఖాస్తు దాఖలు చేయడానికి బదులుగా, పిటిషనర్ సుప్రీంకోర్టును ఆశ్రయించాలని ఎంచుకున్నారు. కాబట్టి ఈ స్పెషల్ లీవ్ పిటిషన్‌ను స్వీకరించడానికి మేము నిరాకరిస్తున్నాము' అని ధర్మాసనం స్పష్టం చేసింది.

బైజూస్ బిజినెస్ హెడ్ ప్రత్యూష అగర్వాల్ రాజీనామా

న్యూదిల్లీ: భారతీయ విద్యా సంబంధిత స్టార్టప్ బైజూస్ ముఖ్య వ్యాపార అధికారి ప్రత్యూష అగర్వాల్ రాజీనామా చేశారు. సంస్థ తన వ్యాపార కార్యకలాపాలను పునర్నించడంతో ప్రత్యూషతో పాటు మరో సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు రాజీనామా చేశారని కంపెనీ ప్రతినిధి మంగళవారం తెలిపారు. అగర్వాల్ ఫిబ్రవరి 2022లో జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ నుంచి బైజూస్‌లో చేరారు. ప్రత్యూషతో పాటు రాజీనామా చేసిన సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు హిమాన్షు బజాజ్, ముకుత్ దీపక్. అనేక చట్టపరమైన, ఆర్థిక ఇబ్బందులతో ఈ ఏడాది బైజూస్ వేల మంది ఉద్యోగులను తొలగించింది. సంస్థను మెరుగుపర్చేందుకు అనేక ప్రయత్నాలు చేసినా కంపెనీ మేనేజ్‌మెంట్ సలహాలను క్రమం తప్పకుండా విస్మరించిందనే వార్తలు వచ్చాయి. 2025 వరకు బైజూస్‌ను ఆడిట్ చేయాలనుకున్న డెలాయిట్, అవసరమైన ప్రమాణాల ప్రకారం ఆడిట్‌లను నిర్వహించగల దాని సామార్థ్యంపై గణనీయ ప్రభావం చూపుతూ కంపెనీ దీర్ఘకాలంగా అలస్యమైన ఆర్థిక నివేదకల కారణంగా నిష్క్రమించింది. బైజూస్ సెప్టెంబర్ నాటికి 2022 ఆడిట్ చేసిన ఆదాయాలను డిసెంబర్ నాటికి 2023 ఫలితాలను దాఖలు చేస్తుందని రాయిటర్స్ నివేదించింది. జులై ప్రారంభంలో కార్పొరేట్ గవర్నెన్స్ సమస్యలను పరిష్కరించడానికి పెట్టుబడిదారు మోహన్‌దాస్ పాయ్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మాజీ చైర్మన్ రజనీశ్ కుమార్‌లతో ఒక సలహా మండలిని ఏర్పాటు చేసింది.

ఆఫీసుకు రావల్సిందే... ఉద్యోగులకు అమెజాన్ హెచ్చరిక

న్యూయార్క్: తమ సంస్థ ఉద్యోగులు ఇక నుంచి కార్యాలయాలకు వచ్చి విధులు నిర్వహించాలని అమెజాన్ ఆదేశించింది. ఇటీవల మార్క్ జూకర్ బెర్గ్ సంస్థ మేటా వర్క్ ఫ్రమ్ హెూమ్‌కు స్వస్తి పలికిన విషయం తెలిసిందే. తాజాగా అమెజాన్ కూడా ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అమెజాన్ సీఈవో యాండీ జెస్సీ ఉద్యోగులకు హెచ్చరికలు జారీ చేశారు. వారంలో మూడు రోజులు తప్పనిసరిగా కార్యాలయాలకు రావాలని ఆదేశించారు. ఒకవేళ ఎవరైనా ఉల్లంఘిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ నియమాళిని పాటించని వారు సంస్థ నుంచి వెళ్లిపోవచ్చని కంపెనీ అంతర్గత సమావేశంలో ఉద్యోగులకు హెచ్చరికలు జారీ చేశారు. ఇంతకు ముందు అమెజాన్ ఈ హెచ్చరికలు జారీ చేసినప్పుడు కొందరు ఉద్యోగులు నిరసనగా తమ ఉద్యోగాలకు రాజీనామా చేశారు. దీంతో అమెజాన్ తన నిర్ణయంపై కాస్త వెనక్కి తగ్గినా... మరోసారి ఉద్యోగులు కార్యాలయానికి రావల్సిందేనని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

స్వల్ప లాభాలతో ముగిసిన మార్కెట్ సూచీలు

ముంబై: దేశీయ మార్కెట్ సూచీలు మంగళవారం స్వల్ప లాభాలతో ముగిశాయి. దీంతో వరుసగా రెండో రోజూ లాభాలు నమోదయ్యాయి. సెన్సెక్స్ 79.22 పాయింట్లు లాభపడి 65,075.82 వద్ద ముగిసింది. నిఫ్టీ 36.60 పాయింట్లు పెరిగి 19,342.65 దగ్గర నిలిచింది. ఉదయం స్వల్ప లాభాలతో ట్రేసింగ్ మొదలు పెట్టిన సూచీలు చివరి గంట వరకు అదే బాటలో పయనించాయి. చివర్లో స్పష్టమైన లాభాలతో ముగిశాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 65,229.03 వద్ద గరిష్టాన్ని 64,956.67 దగ్గర కనిష్టాన్ని తాకింది. నిఫ్టీ 19,377.90 నుంచి 19,309.10 మధ్య ఊగిసలాడింది. లాభాలబాట పట్టిన షేర్లు: జియో ఫైనాన్షియల్, హిండల్కో ఇండస్ట్రీస్, యూపీఎల్, అదానీ పోర్ట్స్, హీరో మోటోకార్ప్, టాటా స్టీల్, బజాజ్ ఆటో, అదానీ ఎంటర్‌ప్రైజెస్, జేఎస్‌డబ్ల్యూ, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్, టెక్ మహీంద్రా, ఎన్‌పీటీసీ, పవర్‌గ్రిడ్, అల్ట్రాటెక్ సిమెంట్స్, టైటాన్ కంపెనీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, గ్రాసిమ్ ఇండస్ట్రీస్, లార్సెన్ అండ్ టోబ్రో, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్. నష్టపోయిన షేర్లు: భారతీ ఎయిర్‌టెల్, హిందుస్థాన్ యూనీలివర్, రిలయన్స్ ఇండస్ట్రీస్, యాక్సిస్ బ్యాంక్, డాక్టర్ రెడ్డీస్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, అపోలో హాస్పిటల్స్, సన్ ఫార్మా, టాటా కన్స్యూమర్, కోటక్ మహీంద్రా బ్యాంక్. బంగారం ధరలు: పది గ్రాముల బంగారం ధర రూ. 43 పెరిగి, రూ.58,930 గా ఉంది. కిలో వెండి రూ.64 పెరిగి రూ.73,676గా ఉంది. రూపాయి మారకం విలువ రూ.82.53 గా ఉంది.

ముందస్తుకు వెళ్లినా గుణపాఠం తప్పదు

- మోదీ, జగన్ సర్కార్లను సాగనంపేందుకు ప్రజలు సిద్ధం
- సంక్షేమం ముసుగులో ఆర్థిక అరాచకం
- తాడేపల్లి ప్యాలెస్‌కు మద్యం ఆదాయం
- కనిగిరి బహిరంగ సభలో రామకృష్ణ

విశాలాంధ్ర-కనిగిరి: మోదీ, జగన్ సర్కార్లను గద్దె దించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. దేశాన్ని కాపాడటానికి, రాష్ట్రాన్ని రక్షించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దెదించాలని పిలుపునిచ్చారు.ముందస్తు ఎన్నికలకు వెళ్లినా మోదీ, జగన్‌కు గుణపాఠం తప్పదని హెచ్చరించారు. వ్యవస్థలను నిర్వీరం చేసిన నరేంద్ర మోదీని విఫల ప్రధానిగా ఆయన అభివర్ణించారు. తొమ్మిదేళ్ల మోదీ పాలనలో సామాన్యులకు, రైతులకు, మధ్యతరగతికి, వ్యాపారులకు ఒరిగిందేమీ లేదని, పైగా దేశంలో పేదరికం పెరిగిందని చెప్పారు. ఆకాశాన్నంటిన నిత్యవసర వస్తువుల ధరలతో పేద, మధ్యతరగతి ప్రజలు అల్లాడుతున్నారన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగం హామీ కలగానే మిగిలిందని రామకృష్ణ విమర్శించారు. నిరుద్యోగులకు కనీసం ఉపాధి కల్పన కూడా చేయలేదన్నారు. మతాల పేరుతో విద్వేషాలు సృష్టిస్తున్నారని, మణిపూర్‌లో ఆరు నెలలుగా జరుగుతున్న హింసలో 200 మందికి పైగా మరణించినా ప్రధాని నోరు విప్పకపోవడం దుర్మార్గమని ఆయన మండిపడ్డారు. 'రాష్ట్రాన్ని రక్షించండి-దేశాన్ని కాపాడండి' నినాదంతో సీపీఐ చేపట్టిన బస్సుయాత్ర మంగళవారం కనిగిరి పట్టణానికి చేరింది. హనీఫ్‌నగర్‌లో సయ్యద్ హనీఫ్ స్థూపం వద్ద సీపీఐ కనిగిరి మండల సమితి అధ్వర్యంలో యాత్రకు ఘనస్వాగతం పలికారు. హనీఫ్ స్థూపం నుంచి పామూరు బస్టాండ్ వద్ద గల గుజ్జుల యల్లమందారెడ్డి, సరళాదేవి చౌక్ వరకు భారీ ర్యాలీ జరిగింది. సీపీఐ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థి, యువజన కార్యకర్తలు, కార్మికులు ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. గుజ్జుల యల్లమందారెడ్డి, సరళాదేవి దంపతులకు నివాళులర్పించారు. అనంతరం అక్కడ జరిగిన బహిరంగ సభకు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సయ్యద్ యాసిన్ అధ్యక్షత వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ సీఎం జగన్ పాలనపై నిప్పులు చెరిగారు. కనిగిరిలో ట్రిపుల్ ఐటీ, పామూరులో నిమ్జ్, దొనకొండలో పారిశ్రామిక కారిడార్ హామీల ఊసే లేదని విమర్శించారు. అరకొర సంక్షేమం తప్ప అభివృద్ధి గురించి ముఖ్యమంత్రి పట్టించు కోవడం లేదన్నారు. చిత్తూరు నుంచి శ్రీకాకుళం దాకా ఒక్క సాగునీటి ప్రాజెక్టును పూర్తి చేయలేదని, కాలువలు నిర్మించలేదని, ఆయకట్టుకి అదనంగా చుక్క నీరు అందించలేదని వివరించారు. ప్రధాని మోదీ సహకారంతో అప్పులు చేయడం మినహా జగన్ చేసిందేమీ లేదని విమర్శించారు. ఏప్రిల్ నుంచి రూ. 3500 కోట్ల అప్పులు చేసిన రాష్ట్రం దేశంలో మరొకటి లేదన్నారు. వైసీపీ నాయకులు ఇష్టానుసారం ఇసుక దోచుకుంటున్నారని ఆరోపించారు. సంక్షేమం ముసుగులో ఆర్థిక అరాచకం కొనసాగుతోందని మండిపడ్డారు. తెచ్చిన అప్పులు సైతం సంక్షేమం పేరుతో నాయకులు దోచుకుంటున్నారన్నారు. జగన్ అధికారం చేపట్టిన తర్వాత ఏడుసార్లు కరెంటు చార్జీలు పెంచి ప్రజలపై రూ.50 వేల కోట్ల భారం మోపారన్నారు. సీఎం జగన్ మద్యం ద్వారా విచ్చలవిడిగా దోపిడీ చేస్తున్నారని, క్వార్టర్ బాటిల్ 160 రూపాయలకు విక్రయిస్తుండగా...అందులో వంద రూపాయలు నేరుగా తాడేపల్లి ప్యాలెస్‌కు చేరుతుందన్నారు. మద్య నిషేధం హామీనే సీఎం జగన్ మర్చిపోయారన్నారు. మద్యం విక్రయం ద్వారా వచ్చిన ఆదాయంతో వచ్చే ఎన్నికల్లో ఓట్లు కొనుగోలు చేయాలని చూస్తున్నారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తొలుత, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి బృందం చేసిన నృత్యాలు, పాడిన పాటలు ప్రజలను ఉర్రూతలూగించాయి. సభలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వై.రవీంద్ర బాబు ప్రసంగించారు. నాయకులు అందే నాసరయ్య, డి.శ్రీనివాస్, ఎం.రమేశ్, కృష్ణ గౌడ్, పోతుల ప్రభాకర్, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రాజేంద్ర, లెనిన్‌బాబు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాన్సన్‌బాబు, శివారెడ్డి, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్ర నాయక్, పెంచలయ్య, రామకృష్ణ, సీపీఐ కనిగిరి మండల కార్యదర్శి జీపీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

బస్సు యాత్ర నేటి షెడ్యూల్

బద్వేలులో బహిరంగసభ

కడపలో మైనార్టీలతో ముఖాముఖి

బస్సుయాత్ర జయప్రదం చేద్దాం

లెనిన్‌బాబు, జాన్సన్‌బాబు పిలుపు

విశాలాంధ్ర-కడప రూరల్: 'రాష్ట్రాన్ని రక్షిద్దాం-దేశాన్ని కాపాడుదాం' నినాదంతో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ నేతృత్వంలో జరుగుతున్న బస్సుయాత్రను జయప్రదం చేద్దామని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ రాష్ట్ర నేతలు వి.జాన్సన్‌బాబు, ఎన్.లెనిన్ బాబు పిలుపునిచ్చారు. బద్వేల్‌లోని జేవీ భవన్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ మోదీ, జగన్ సర్కార్లు విద్యార్థులను, యువకులను మోసం చేస్తున్నాయని

విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీలపై ప్రధాని మోదీ మడం తిప్పారని మండిపడ్డారు. కేంద్రం తీసుకొచ్చిన జాతీయ విద్యావిధానాన్ని సీఎం జగన్ గుడ్డిగా అమలు చేస్తున్నారని ఆరోపించారు. కేంద్రం తీసుకొచ్చిన విద్యావిధానం ఫాసిస్టు విధానాలకు బ్లూ ప్రింట్ వంటిదన్నారు. ప్రాథమిక విద్యను సర్వనాశనం చేస్తున్నారని, ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయడం లేదని తెలిపారు. స్వయం ప్రతిపత్తి గల యూజీసీ, ఎన్‌సీఇ వంటి సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారని, వైద్య సీట్లు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. అందువల్ల విద్యార్థి, యువజనులు బస్సుయాత్రలో పాల్గొని జయప్రదం చేయాలని, రాష్ట్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలని విజ్ఞప్తి చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.వలరాజు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.దస్తగిరి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శివశంకర్, నాయకులు లీలాధర్ తదితరులు పాల్గొన్నారు.

కోడికత్తి కేసు విచారణ వాయిదా

విశాఖలో కోర్టుకు హాజరైన నిందితుడు శ్రీను

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోడికత్తి కేసుపై మంగళవారం విశాఖ ఎన్ఐఏ కోర్టులో విచారణ జరిగింది. విశాఖ మూడో అదనపు జిల్లా కోర్టు విచారణను సెప్టెంబర్ 6 తేదీ కివాయిదా వేసింది. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్షనేతగా ఉన్నప్పుడు 2018, అక్టోబరు 25న విశాఖ విమానా శ్రయంలో ఆయనపై దాడి జరిగింది. నిందితుడు శ్రీను కోడిపందేల్లో ఉపయోగించే కత్తితో ఆయనపై దాడి చేయడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్న సంగతి విదితమే. మంగళవారం విశాఖ ఎన్ఐఏ కోర్టులో ఈ కేసు విచారణకు వచ్చింది. పోలీసులు రాజమహేంద్రవరం జైలు నుంచి విశాఖకు నిందితుడు శ్రీనును కోర్టుకు తీసుకువచ్చారు. శ్రీను కుటుంబసభ్యులు కూడా కోర్టుకు హాజరయ్యారు. ఇప్పటి వరకు విజయవాడలో ఈ కేసు విచారణ జరగ్గా ఇటీవల ఈ కేసును విశాఖకు బదిలీ చేశారు. దీంతో విశాఖలోని ఎన్ఐఏ కోర్టులో విచారణ ను కొనసాగించారు. ఐదేళ్లుగా జైల్లోనే మగ్గిపోతున్న శ్రీను కు బెయిల్ ఇవ్వాలంటూ శ్రీను కుటుంబ సభ్యులు, న్యాయవాది బెయిల్ పిటిషన్ వేశారు. ఇప్పటి వరకు ఏడుసార్లు నిందితుడు శ్రీను తరపున న్యాయవాది బెయిల్ పిటిషన్ వేయగా కోర్టు తిరస్కరించింది. మరోవైపు ముఖ్యమంత్రి జగన్ తరపు న్యాయవాది కూడా విశాఖ కోర్టుకి హాజరై వీడియో కాల్ ద్వారా సీఎం జగన్ వాంగ్మూలాన్ని తీసుకోవాలని కోరుతూ పిటిషన్ వేశారు. విచారణ అనంతరం నిందితుడు శ్రీను తరపు న్యాయవాది సలీం మీడియాతో మాట్లాడుతూ... సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్ఓసీ అయినా ఇవ్వాలని, లేదంటే ఆయన వచ్చి వాంగ్మూలం ఇవ్వాలన్నారు. ఈ కేసులో కుట్ర కోణం లేదని ఇప్పటికే ఎన్ఐఏ తేల్చిచెప్పిందని రాజకీయాల కోసమే, ఈ కేసును వాయిదాలతో నడిపిస్తున్నారని అనుమానం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా శ్రీనుకు బయలు మంజూరు చేయాలని అతడి కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన

నెల్లూరు బహిరంగసభలో రామకృష్ణ విమర్శ

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: ఆంధ్రప్రదేశ్‌లో అరాచక పాలన కొనసాగుతోందని, బీజేపీ ప్రభుత్వం దేశాన్ని అప్పులపాలు చేసిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. సీపీఐ తలపెట్టిన బస్సుయాత్ర మంగళవారం నెల్లూరుకు చేరుకుంది. టౌన్‌హాలులో నిర్వహించిన సభలో రామకృష్ణ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై మోయలేని భారాలు మోపారని మండిపడ్డారు. నాలుగున్నరేళ్లలో ఏడుసార్లు విద్యుత్ చార్జీలు పెంచిన ఘనత జగన్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. విద్యుత్ చార్జీల రూపంలో ప్రజలపై 50 వేల కోట్ల రూపాయల భారం వేశారని మండిపడ్డారు. చెత్త మీద కూడా పన్ను వేసిన అసమర్థ ముఖ్యమంత్రి జగన్ అని వ్యాఖ్యానించారు. అప్పులు ఇబ్బడిముబ్బడిగా పెరిగినా అభివృద్ధి మాత్రం కనిపించడం లేదని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం విషయంలో జగన్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. పోలవరం నిర్మాణం పూర్తయితే 26 జిల్లాలకు తాగు, సాగునీటి సమస్య తీరుతుందని, విద్యుత్ ఉత్పాదన కూడా పెరుగుతుందని పేర్కొన్నారు. అలాంటి ప్రాజెక్టును జగన్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. రాష్ట్రంలో ఇసుక మాఫియా పేట్రేగి పోతోందన్నారు. గతంలో 1500 నుంచి 2000 రూపాయల వరకు ఉన్న ట్రాక్టర్ ఇసుక ఇప్పుడు 6000కు చేరిందని విమర్శించారు. నకిలీ బిల్లులతో ఇసుక అక్రమ రవాణా సాగుతోందని, ఇసుక వల్ల వచ్చే డబ్బులు తాడేపల్లి ప్యాలెస్‌కు చేరుతున్నాయన్నారు. లిక్కర్ సొమ్ము కూడా తాడేపల్లి ప్యాలెస్‌లో భద్రపరచుకుంటున్నారని ధ్వజమెత్తారు. దోచుకున్న డబ్బును వచ్చే ఎన్నికల్లో పంచడానికి జగన్ సిద్ధమయ్యారన్నారు. 25 ఎంపీ స్థానాలు ఇస్తే కేంద్రం మెడలు వంచుతానని ప్రగల్భాలు పలికారని, ఇప్పుడు కేంద్రం ముందు మోకరిల్లుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర హక్కుల సాధనలోనూ ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రశ్నించిన వారిని పోలీసుల నోటీసులు ఇచ్చి వేధిస్తున్నారన్నారు. రాష్ట్రంలో పోలీస్ పాలన సాగుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్ ప్రభుత్వాన్ని సాగనంపుతామని, ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.

కేంద్రంలో మోదీ సర్కారు అన్ని రంగాల్లో విఫలమైందని రామకృష్ణ విమర్శించారు. ఇచ్చిన హామీలన్నీ విస్మరించిందన్నారు. విదేశాల నుంచి తీసుకొచ్చిన నల్లధనం ఎవరి ఖాతాలో పడ్డాయని ఆయన ఎద్దేవా చేశారు. మోదీ హయాంలో అదానీ, అంబానీ ఆస్తులు మాత్రమే పెరిగాయని, ప్రజల జీవన ప్రమాణాలు దిగజారాయని చెప్పారు. దేశంలో మత విద్వేషాలు సృష్టించడమే బీజేపీ అజెండా అన్నారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అంటూ ప్రచారం చేసుకుంటున్న బీజేపీ...మణిపూర్‌లో ఏమి జరుగుతోందని ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వం ఉన్నా అక్కడ హింస ఎందుకు చెలరేగిందని నిలదీశారు. సామాన్యుడు బతకలేని పరిస్థితులు దేశంలో ఉన్నాయన్నారు. రాష్ట్రానికి బీజేపీ ప్రభుత్వం తీరని ద్రోహం చేసిందన్నారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టిందని విమర్శించారు. ప్రభుత్వ ఆస్తులను అమ్మేస్తుంటే వైసీపీ ప్రభుత్వం ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. ఏమి సాధించారని ప్రధాని మోదీపై ప్రశంసల జల్లు కురిపించారో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు సమాధానం చెప్పాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. మోదీని ఎందుకు వ్యతిరేకించకూడదో చెప్పాలన్నారు. మోదీలో చంద్రబాబుకు కనిపించిన మంచి లక్షణాలను ప్రజలకు వివరించాలన్నారు.

బహిరంగ సభకు సీపీఐ నెల్లూరు జిల్లా కార్యదర్శి ధర్మా అంకయ్య అధ్యక్షత వహించగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డి.జగదీశ్, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్ర నాయక్, పెంచలయ్య, రాష్ట్ర కోశాధికారి ఆర్.పిచ్చయ్య, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శివారెడ్డి, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్ర, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు విజయలక్ష్మి, ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ వెంకట సుబ్బయ్య, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మాలకొండయ్య, నగర కార్యదర్శి అరిగెల నాగేంద్ర సాయి,జిల్లా కార్యవర్గ సభ్యులు సిరాజ్, షాన్వాజ్, సురేశ్, రమణయ్య, ఆనంద్, మహిళా నాయకురాలు వినోదమ్మ, సీపీఐ సీనియర్ నాయకులు పాముల దశరథరామయ్య, వి.రామరాజు, ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రాధా మనోహర్ సహా ప్రజానాట్యమండలి కళాకారులు పాల్గొన్నారు.

ముందస్తు ఎన్నికలకే బీజేపీ మొగ్గు

ప్రతిపక్షాల ఐక్యతతో కమలంలో భయం: నితీశ్

నలంద: ప్రతిపక్షాల బలమైన ఐక్యత కారణంగా బీజేపీ భయపడుతోందని, అందువల్ల ముందస్తు ఎన్నికల కోసం కసరత్తు చేస్తోందని బీహార్ ముఖ్యమంత్రి, జేడీయూ అధినేత నితీశ్‌కుమార్ మంగవారం చెప్పారు. బీజేపీ ముందస్తు ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉందన్న పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చెప్పిన మరుసటి రోజే నితీశ్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ఏడాది డిసెంబరు లేదా జనవరిలో లోక్‌సభ ఎన్నికలు జరుగుతాయని మమత సోమవారం చెప్పారు. మమత వ్యాఖ్యలపై విలేకరుల సమావేశంలో నితీశ్‌ను ప్రశ్నించగా ఎన్‌డీఏ ప్రభుత్వం ముందుగానే లోక్‌సభ ఎన్నికలకు వెళుతుందని గడచిన ఏడెనిమిది నెలలుగా తాను చెబుతున్నానని, ప్రతిపక్ష పార్టీలు బలం పుంజుకోవడంతో బీజేపీ భయపడుతోందని చెప్పారు. అందుకే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించడం కోసూం ప్రతిపక్ష పార్టీలన్నీ సాధ్యమైనంత త్వరగా ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందని నితీశ్ సూచించారు. వ్యక్తిగతంతా తనకేమీ కోరికలు, ఆకాంక్షలు లేవని, బీజేపీని ఓడించడానికి ఎన్నికలకు ముందే పెద్దసంఖ్యలో ప్రతిపక్ష పార్టీలన్నీ ఒకే వేదికపైకి రావాలని తాను కోరుకుంటున్నానన్నారు. ప్రతిపక్ష కూటమి ఇండియాలో చేరడానికి అత్యధిక పార్టీలు ఆసక్తి చూపుతున్నాయని నితీశ్ ఇటీవల ప్రకటించిన విషయం విదితమే. 'ప్రతిపక్ష పార్టీల ఐక్యత కోసం మనం చొరవ తీసుకున్నాం. ఆగస్టు 31, సెప్టెంబరు 1 తేదీల్లో ముంబైలో జరిగే సమావేశం తర్వాత ఇండియా కూటమి మరింత బలపడుతుంది' అని నితీశ్ అన్నారు. నలంద ఓపెన్ యూనివర్సిటీలో కొత్త క్యాంపస్‌ను ప్రారంభించిన తర్వాత నితీశ్ విలేకరులతో మాట్లాడారు. కుల గణన ప్రక్రియ పూర్తవుతోందని, త్వరలో దీనిని ప్రచురిస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. కులగణనకు సంబంధించి మొత్తం ప్రక్రియ పూర్తయితే అణగారిన వర్గాలతో పాటు సమాజంలోని అన్నివర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని సీఎం తెలిపారు. కుల గణన డేటా వస్తే ఏ ప్రాంతంలో ఎలాంటి అభివృద్ధి చేయవచ్చో ప్రభుత్వం ఓ అంచనాకు వస్తుందన్నారు. కుల గణనకు సంబంధించిన వివరాలు ప్రచురిస్తే...ఇతర రాష్ట్రాలు కూడా తమను అనుసరిస్తాయని నితీశ్ చెప్పారు. కుల ఆధారిత సర్వే చేయాలని ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నామని, దీనికి ముందు బీజేపీ సహా అన్ని పార్టీల అభిప్రాయాలను సేకరించామన్నారు. ఇప్పుడు బీజేపీ ఏమి చెబుతుందో వినాల్సిన అవసరం తనకు లేదని, జనాభా లెక్కల సేకరణపై కేంద్రం ఎందుకు మౌనం వహిస్తుందో అర్థం కావడం లేదని నితీశ్ ప్రశ్నించారు.

మణిపూర్ అసెంబ్లీ నిరవధిక వాయిదా

- గంట కూడా సాగని వైనం
- 'సేవ్ డెమోక్రసీ' అంటూ కాంగ్రెస్ నినాదాలు
- ఐదురోజులు సభ జరపాలని డిమాండ్

ఇంఫాల్: మణిపూర్ అసెంబ్లీ సమావేశమైన గంట వ్యవధిలోనే నిరవధిక వాయిదా పడింది. అసెంబ్లీ సమావేశాలను ఐదు రోజులకు పొడిగించాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆందోళన చేయడంతో సభలో గందరగోళం చెలరేగింది. ప్రజాస్వామ్యాన్ని కాపాడండి అంటూ కాంగ్రెస్ సభ్యులు నినాదాలు చేశారు. దీంతో మణిపూర్ అసెంబ్లీ దద్దరిల్లింది. హింసతో అట్టుడుకుతున్న రాష్ట్ర పరిస్థితులపై చర్చించడానికి ఒక్కరోజు చాలదని, అందుకే సమావేశాలను ఐదురోజులకు పొడిగించాలని మాజీ సీఎం ఒక్రోమ్ ఒబోబి నేతృత్వంలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. సుమారు నాలుగు నెలల హింసాత్మక ఘటనల అనంతరం రాష్ట్ర అసెంబ్లీ మంగళవారం సమావేశమైంది. అసెంబ్లీలో ప్రతిపక్ష నేతలు 'సేవ్ డెమోక్రసీ' అంటూ నినాదాలు చేయడంతో స్పీకర్ తోక్‌చోమ్ సత్యబ్రత సభను అరగంట పాటు వాయిదావేశారు. ప్రశ్నోత్తరాలు, ప్రైవేట్ మెంబర్ మోషన్ నిర్వహించలేదు. అసెంబ్లీ ప్రారంభం కాగానే మృతులకు సంతాపం ప్రకటిస్తూ... కేవలం రెండు నిమిషాలు మౌనం పాటించడంపై కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఒక్కరోజు సమావేశం ప్రజా ప్రయోజనాల కోసం కాదని ఆగ్రహం వ్యక్తం చేసింది. అసెంబ్లీ సమావేశాలను ఐదురోజులు పొడిగించాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఎన్.బీరేన్ సింగ్, కాగ్రెస్ నేత ఒక్రోమ్ ఒబోబి మధ్య మాటలయుద్ధం నెలకొంది. మణిపూర్ అసెంబ్లీ చివరిసారిగా బడ్జెట్ సమావేశాల కోసం ఫిబ్రవరి-మార్చిలో సమావేశమైంది. ఏడాదిలో కనీసం రెండుసార్లు అసెంబ్లీ సమావేశం కావాల్సి ఉంటుంది. గత సమావేశం మార్చిలో జరిగింది. సెప్టెంబరు 2 లోగా మరో సమావేశం జరగాల్సి ఉండటంతో గవర్నర్ ఆమోదం మేరకు నేడు అసెంబ్లీ సమావేశమైంది. అయితే ఈ ఒక్కరోజు సమావేశాన్ని కుకీ జోమి గిరిజన సంఘాలు వ్యతిరేకించాయి. ఈ కమ్యూనిటీకి చెందిన 10 మంది ఎమ్మెల్యేలు సభకు గైర్హాజరయ్యారు. మొయితీ కమ్యూనిటీ ప్రాంతంలో ఉన్న అసెంబ్లీకి ఈ సమయంలో ప్రయాణించడం సురక్షితం కాదని వారు పేర్కొన్నారు. దీంతో అసెంబ్లీ సమావేశాలను వాయిదా వేయాలని వారు గవర్నర్‌ను అభ్యర్థించారు. ఈ అభ్యర్థనను ప్రభుత్వం తిరస్కరించింది. నాగా ఎమ్మెల్యేలు అసెంబ్లీకి హాజరయ్యారు.

ముందుగా సీఎం బీరేన్‌సింగ్ మాట్లాడుతూ రాష్ట్రంలో జరిగిన హింసలో చాలామంది ప్రాణాలు కోల్పోయారని, ఇందుకు చింతిస్తున్నామన్నారు. బాధిత కుటుంబాలను ఓదార్చడానికి మాటలు సరిపోవని చెప్పారు. రాష్ట్రంలో మత సామరస్యతను చర్చల ద్వారా శాంతియుతంగా పరిష్కరించు కోవాల్సిన అవసరం ఉందని, ఇందుకు రాజకీయాలకతీతంగా వ్యవహరించాలని సభ తీర్మానించింది. కులం, వర్గం, ప్రాంతం, భాష, మతంతో సంబంధం లేకుండా మణిపూర్ ప్రజలు శాంతియుతంగా, సామరస్యంగా కలిసి జీవించేందుకు కృషి చేద్దామని సభ ఏకగ్రీవంగా తీర్మానించిందని, రాష్ట్రంలో శాంతికే అధిక ప్రాధాన్యత అని ముఖ్యమంత్రి చెప్పారు. చంద్రయాన్-3 విజయవంతంగా చంద్రుడిపై ల్యాండ్ కావడంపై అసెంబ్లీ హర్షం వెలిబుచ్చింది. శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపింది. అనంతరం ప్రజాస్వామ్యాన్ని కాపాడండి అంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నినాదాలు చేశారు. సీట్లలో కూర్చోవాల్సిందిగా స్పీకర్ పదేపదే విజ్ఞప్తి చేసినా కాంగ్రెస్ సభ్యులు నినాదాలు చేస్తూనే ఉన్నారు. ముందు అరగంట వాయిదా వేసిన స్పీకర్...తిరిగి సభ ప్రారంభమైనా పరిస్థితిలో మార్పు లేకపోవడంతో ఏకంగా అసెంబ్లీని నిరవధికంగా వాయిదా వేశారు.

నేటినుంచి క్రికెట్ ఆసియా కప్

పాక్-నేపాల్ మధ్య తొలిపోరు

2న భారత్-పాక్ మ్యాచ్

న్యూఢిల్లీ: ఆసియా ఉపఖండ దేశాలు మినీ ప్రపంచకప్‌గా భావించే ఆసియా కప్ టోర్నీ బుధవారం ప్రారంభం కానుంది. ఈ మెగా టోర్నీకి శ్రీలంక, పాకిస్తాన్ సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనుండగా... దాదాపు నాలుగు స్టేడియాల్లో మ్యాచ్‌లు జరగనున్నాయి. పాక్‌లోని ముల్తాన్, లాహోర్‌తోపాటు శ్రీలంకలో పల్లెకెల్లె, కొలంబో స్టేడియాలు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. ఇక ఈ టోర్నీ కోసం బెంగళూర్‌లో టీమిండియా ముమ్మరంగా సాధన చేసింది. మంగళవారం ఆటగాళ్లంతా శ్రీలంకకు బయలుదేరారు. కొలంబో వెళ్లి ఒకరోజు విశ్రాంతి తీసుకున్న తర్వాత మళ్లీ అక్కడ ప్రాక్టీస్ చేయనున్నారు. ఈ ఆసియాకప్ కోసం ఆరు దేశాలు పోటీపడనున్నాయి. ఆగస్టు 30 మధ్యాహ్నం జరగనున్న తొలి మ్యాచ్‌లో పాకిస్తాన్ - నేపాల్ తలపడనుండగా... ఈ మ్యాచ్ బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం కానుంది. అయితే ఇప్పటి వరకు కేవలం రెండుసార్లు టీ20 ఫార్మాట్‌లో జరిగిన ఆసియాకప్... ఇప్పుడు మళ్లీ వన్డే ఫార్మాట్లో జరగనుంది. గతేడాది పొట్టి ఫార్మాట్లో జరిగిన ఆసియాకప్‌ను శ్రీలంక గెలుచుకోగా... ఇప్పటి వరకు భారత్ అత్యధికంగా ఏడుసార్లు ఆసియాకప్‌లో విజేతగా నిలిచింది. దీంతో ఈసారి కూడా నాలుగు జట్ల నుంచి తీవ్ర పోటీ నెలకొం ది. భారత్, పాకిస్తాన్‌తో పాటు శ్రీలంక, బంగ్లాదేశ్ ఈ రేసులో ఉన్నాయి. కొద్ది నెలల్లో భారత్‌లో వన్డే ప్రపంచకప్ జరగనున్న క్రమంలో ప్రతి జట్టూ తమ శక్తిసామర్థ్యా లను పరీక్షించుకునేందుకు ఈ టోర్నీని వేదికగా మార్చుకొనే అవకాశాలు కనిపిస్తున్నాయి. భారత్, పాకిస్తాన్, నేపాల్ గ్రూప్-ఏలో, శ్రీలంక, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్ గ్రూప్-బిలో ఉన్నాయి. ఈ రెండు గ్రూపుల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సూపర్-4కు అర్హత సాధిస్తాయి. గ్రూప్ దశలో భారత్ సెప్టెంబర్ 2న పాకిస్తాన్‌తోనూ, సెప్టెంబర్-4న నేపాల్‌తోనూ తలపడనుంది. రోహిత్‌శర్మ నేతృత్వంలోని భారత జట్టు ఈ టోర్నీలో అదృష్టం పరీక్షించుకోనుంది. గాయం కారణంగా పాకిస్తాన్, నేపాల్‌తో జరిగే తొలి రెండు మ్యాచ్లకు కేఎల్ రాహుల్ దూరం కానున్నా డు. ఇషాన్ కిషన్ వికెట్ కీపింగ్ బాధ్యతలు నిర్వర్తించనున్నాడు. ఆసియా కప్ 2023 కోసం బెంగళూరులోని ఆలూర్‌లో భారత క్రికెట్ జట్టు కఠినమైన శిక్షణను ముగించింది.

టీమిండియాకు ఈ ఐదుగురూ కీలకం...

ఆసియాకప్‌ను టీమిండియాను కైవసం చేసుకోవాలంటే... జట్టులోని ఐదుగురు ఆటగాళ్లు కీలకం కానున్నారు. ఇందులో మొదటి పేరు విరాట్ కోహ్లీదే. కోహ్లితో పాటు తిలక్ వర్మ, జస్‌ప్రీత్ బుమ్రా, రవీంద్ర జడేజా, ఇషాన్ కిషన్ ఈ జాబితాలో ఉన్నారు. యువ బ్యాట్స్‌మెన్ తిలక్ వర్మ వెస్టిండీస్‌తో జరిగిన టీ20 అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. భారత్ తరపున ఇప్పటి వరకు ఆడిన 7 మ్యాచ్‌ల్లో 174 పరుగులు చేశాడు. తిలక్ తన తుఫాన్ బ్యాటింగ్‌తో అందరి హృదయాలను గెలుచుకున్నాడు. అందుకే ఆసియా కప్‌నకు జట్టులో చోటు దక్కించుకున్నాడు. తిలక్ రాణిస్తాడని అంతా భావిస్తున్నారు. వెస్టిండీస్‌పై ఇషాన్ కిషన్ వరుసగా నాలుగు అర్ధ సెంచరీలు సాధించాడు. వన్డేల్లో మూడు అర్ధ సెంచరీలు సాధించాడు. ఫామ్‌లో ఉన్న అతను ఇప్పుడు ఆసియా కప్‌లో రాణించగలడు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఇషాన్ వన్డే ఫార్మాట్‌లో డబుల్ సెంచరీ సాధించిన విషయం తెలిసిందే. అనుభవజ్ఞుడైన ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా భారత్ తరపున చాలా సందర్భాలలో అద్భుత ప్రదర్శన చేశాడు. అతను ఇప్పటివరకు 177 వన్డేల్లో 2560 పరుగులు చేశాడు. దీంతో పాటు 194 వికెట్లు తీశాడు. జడేజా పెద్ద మ్యాచ్‌లలో బాగా రాణిస్తున్నాడు.

భారత ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా అద్భుతంగా పునరాగమనం చేశాడు. ఇటీవల ఐర్లాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో నాలుగు వికెట్లు తీశాడు. గాయం కారణంగా బుమ్రా చాలా కాలం పాటు టీమ్ ఇండియాకు దూరంగా ఉన్నాడు. అతను ఆసియా కప్‌లో టీమ్ ఇండియాకు మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శన చేయగలడు.

సచిన్ రికార్డుపై కన్నేసిన రోహిత్, కోహ్లీ

ఈ క్రమంలో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఓ రికార్డుపై కన్నేశారు. ఇప్పటి వరకు ఆ రికార్డు క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ పేరిట ఉంది. భారత బ్యాటర్‌గా ఆసియా కప్‌లో అత్యధిక పరుగులు చేసిన క్రికెటర్‌గా సచిన్ కొనసాగుతున్నాడు. ఆసియా కప్‌లో (వన్డే ఫార్మాట్) 22 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో సచిన్ 23 మ్యాచుల్లో 971 పరుగులు సాధించాడు. భారత క్రికెటర్లలో సచిన్ తర్వాత రోహిత్ శర్మ 22 మ్యాచుల్లో 745 పరుగులు, ధోనీ 19 మ్యాచుల్లో 648 పరుగులు, విరాట్ కోహ్లీ 11 మ్యాచుల్లోనే 613 పరుగులతో కొనసాగుతున్నారు. తక్కువ మ్యాచుల్లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా విరాట్ నిలిచాడు. ఇక ఈ టోర్నీలో భారత్ కనీసం ఐదు మ్యాచ్‌లు ఆడే అవకాశం ఉంది. కాబట్టి, రోహిత్ మరో 226 పరుగులు, విరాట్ 358 పరుగులు సాధిస్తే సచిన్‌ను అధిగమించే అవకాశం ఉంది. ఆసియా కప్‌లో అత్యధికంగా పరుగులు చేసిన బ్యాటర్ మాత్రం జయసూర్య (1220 పరుగులు) కావడం విశేషం.

డిస్నీ హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఆసియా కప్ 2023 ఉచితంగా చూడొచ్చు. ప్రసార హక్కులను డిస్నీ+హాట్ స్టార్ సొంతం చేసుకుంది. డిస్నీ+హాట్ స్టార్ మొబైల్ యాప్ ద్వారా ఆసియా కప్ టోర్నీ మొత్తాన్ని ఉచితంగానే వీక్షించవచ్చు. అయితే ఈ ప్రత్యక్ష ప్రసారాలు మొబైల్ యాప్‌నకు మాత్రమే పరిమితం చేశారు. పెద్ద స్క్రీన్‌పై ప్రత్యక్షంగా చూడటానికి సభ్యత్వం అవసరం.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.